ప్రజాశక్తి
శనివారం 21 అక్టోబర్ 2023 5
కర్నూలు

త్యాగానికి ప్రతీక

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పోలీసు విధి నిర్వహణ అత్యంత శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగుల్లా కొన్ని గంటలకు పరిమితమైనది కాదు. ఎండా.. వాన, పగలూ.. రాత్రి అనే తేడా లేకుండా విధులు నిర్వహిస్తుంటారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం. సంపన్నుడు మొదలు.. సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతి అవసరానికీ సాయం కోరేది పోలీసులనే. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడేవారు సైనిక జవానులైతే.. అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు. సంఘ విద్రోహ శక్తులతో పోరాడి విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకునేందుకు శనివారం జిల్లాలో పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం ప్రతి సంవత్సరం అక్టోబరు 21న జరుపుకుంటారు. భారత్-చైనా సరిహద్దుల్లోని ఆక్సయ్ చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తున రక్తం గడ్డకట్టే మంచు పర్వతాల మధ్యన ఉన్న వేడి నీటిబుగ్గ (హాట్ స్ప్రింగ్స్) అమర జవానుల త్యాగాలకు ప్రతీకగా మన మధ్య నిలిచి ఉంది. దేశవ్యాప్తంగా విధినిర్వహణలో అసువులుబాసిన పోలీసులను స్మరిస్తూ, ప్రతి ఏడాది అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించడం ఈ పవిత్ర స్థలం నుంచే ఆరంభమైంది. మిలటరీ ఎత్తుగడలకు చైనా సరిహద్దులోని భారత భూభాలైన లడఖ్, సియాచిన్ ప్రాంతాలు కీలకమైనవి. సరిహద్దు భద్రతాదళం, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ వంటి ప్రత్యేక భద్రతాదళాలు ఏర్పడక ముందు సరిహద్దులను రక్షించే బాధ్యతను కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్స్ బలగాలు నిర్వర్తించేవి. 1959 అక్టోబరు 21న డీఎస్పీ కరమ్ సింగ్ నేతత్వంలో పంజాబ్‌కు చెందిన 21 మంది సభ్యుల బృందం సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తుండగా, చైనా రక్షణ బలగాలు సియాచెన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్పీఎఫ్ దళం హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో దీటుగా ఎదురొడ్డి పోరాడింది. ఆ పోరాటంలో పది మంది భారత జవాన్లు ప్రాణాలను కోల్పోయారు. హాట్ స్ప్రింగ్స్ అంటే వేడి నీటిబుగ్గ అని అర్థం. కానీ భారత జవాన్ల రక్తంతో తడిచిన హాట్ స్ప్రింగ్స్ నెత్తుటి బుగ్గగా మారి పవిత్రస్థలంగా రూపు దిద్దుకుంది. ప్రతి ఏడాదీ అన్ని రాష్ట్రాల పోలీసులతో కూడిన బృందం ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి నివాళులు అర్పించడం ఆనవాయితీ. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోనూ శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోలీస్ అమరవీరుల స్థూపాలకు నివాళులు అర్పించనున్నారు.

తగ్గిన వరి సాగు

- దిగుబడిపై ప్రభావం
- ఆహార సంక్షోభానికి దారి తీసే ప్రమాదం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో రాను రాను వరి సాగు తగ్గుతోంది. ఈ ఏడాది కూడా సాధారణ సాగు కంటే తక్కువ విస్తీర్ణంలోనే సాగైంది. దీంతో దిగుబడిపై ప్రభావం చూపనుంది. దిగుబడి తీవ్రంగా తగ్గిపోతే ఆహారం సంక్షోభానికి దారి తీసే ప్రమాదం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు...

ఆరుగాలం శ్రమించి రక్తాన్ని స్వేదంగా మార్చి అన్నదాతలు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లభించక పోవడం .. దీనికి తోడు పెరిగిన కూలీ, డీజిల్, ఎరువుల ధరలు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో డబ్బు చెల్లించకపోవడంతో రైతులు వరి సాగు పట్ల మక్కువ చూపడం లేదు. ఏడాదికేడాది జిల్లాలో వరి సాగు తగ్గుతోంది. వరి సేద్యం పట్ల రైతులు అంతగా ఆసక్తి చూపకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఎరువుల ధరల పెరుగుదల, అదనుకు కావాల్సిన ఎరువులు దొరక్క పోవడం, ధాన్యానికి మెరుగైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ప్రకటించకపోవడం, పెరిగిన డీజిల్, కూలీల ధరలతో ఖర్చులు అధికం కావడంతో పెటుబడి ఖర్చులు పెరగడం వలన అన్నదాతలు వరి సాగుపై విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ ధోరణి స్థిరపడితే ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరిస్తున్నారు.

నంద్యాల జిల్లాలో ప్రధాన పంటగా ఉండే వరి సాధారణ సాగు 1,76,315 ఎకరాలు కాగా గతేడాది 1.59 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఆ సంఖ్య ఈ ఏడాదికి 1,25,950 ఎకరాలకు తగ్గింది. సాధారణ సాగులో గతేడాది 90 శాతం సాగు కాగా ఈ ఏడాది 71 శాతం మాత్రమే సాగైంది. ఎకరాకు సరాసరిన 25 బస్తాల ధాన్యం పడుతుంది. ఆ లెక్కన నంద్యాల జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాదికి 4,32,875 బస్తాల ధాన్యం దిగుబడి తగ్గింది. 2,16,437.5 క్వింటాళ్ల ధాన్యం తక్కువ పండింది. కర్నూలు జిల్లాలో వరి సాధారణ సాగు 32,272.5 ఎకరాలు కాగా గతేడాది 31,407 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఆ సంఖ్య 29,190 ఎకరాలకు తగ్గింది. సాధారణ సాగులో గతేడాది 97 శాతం సాగు కాగా ఈ ఏడాది 90 శాతం మాత్రమే సాగైంది. ఆ లెక్కన కర్నూలు జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాదికి 55,437.5 బస్తాల ధాన్యం దిగుబడి తగ్గింది. 27,718.75 క్వింటాళ్ల ధాన్యం తక్కువ పండింది. ప్రతి ఏడాది దిగుబడి తగ్గడం వల్ల ఆహార సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బియ్యం ధరలపై ప్రభావం

వరిసాగు తగ్గుదల బియ్యం ధరలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతోంది. డిమాండ్ పెరగడం సరఫరా తక్కువ అవడంతో రోజు రోజుకూ బియ్యం ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. జిల్లాలో రెండేళ్ల క్రితం కర్నూలు సోనా రకం బియ్యం 50 కిలోల బస్తా రూ.1600 నుంచి రూ.1800 మధ్య ఉండేది ప్రస్తుతం ఆ ధర రూ.3వేలకు చేరింది. గతంలో లూజు కిలో బియ్యం రూ.50కు విక్రయిస్తుండగా ప్రస్తుతం రూ.65కు విక్రయిస్తున్నారు. డిమాండ్ పెరిగితే బియ్యం ధరలు మరింత పెరిగే అవకావం ఉందని పలువురు అంటున్నారు.

సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

వెంకట్రామిరెడ్డి సేవలు చిరస్మరణీయం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

సిపిఎం ఉద్యమానికి, అభివృద్ధికి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా పని చేసి విద్యార్థి దశలోనే ఉద్యమ నేతగా కీర్తిశేషులు వెంకటరామిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో సంస్మరణ సభ నిర్వహించారు. సిపిఎం మండల సీనియర్ నాయకులు శ్రీరాములు అధ్యక్షత వహించారు. ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సిపిఎం శిక్షణ తరగతుల నిర్వహణ, ఉద్యమానికి, పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు అమోఘమని తెలిపారు. కమ్యూనిస్టు సిద్ధాంత పరంగా పేదల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. తెర్నేకల్ గ్రామంలో సిపిఎం కార్యాలయాన్ని నిర్మించడానికి ఎంతో సహకారం అందించారని తెలిపారు. వెంకటరామిరెడ్డి సోదరుని కుమారుడు శేషి రెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు రామాంజనేయులు, వీరశేఖర్, రంగారెడ్డి, ఎంపిపి భర్త లుముంబా, సర్పంచి అరుణ్ కుమార్, సిపిఎం మండల నాయకులు రంగారెడ్డి, సురేంద్ర, పరమేష్, మహబూబ్ బాషా, అశోక్, బజారి, నాయకులు నాగేంద్ర, లక్ష్మి రెడ్డి, సుధాకర్, వైసిపి నాయకులు రాఘవేంద్ర, గ్రామ పెద్దలు చెన్నప్ప పాల్గొన్నారు.

ఒపిఎస్ సాధనకు యుటిఎఫ్ పోరుబాట

- జిల్లా, మండల కేంద్రాల్లో నిరవధిక దీక్షలు
- ప్రతిపక్ష పార్టీలు ఉపాధ్యాయ , ప్రజా సంఘాలు మద్దతు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగ ఉపాధ్యాయులకు అధికారంలోకి రాగానే సిపిఎస్ రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అయ్యాక బుట్ట దాఖలు చేశారు. జిల్లా , మండల కేంద్రాల్లో సిపిఎస్, జిపిఎస్ రెండు విధానాలు రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ నిరవధిక దీక్షలకు పూనుకున్నారు. ఈ పోరాటానికి ప్రతిపక్ష పార్టీలు, ఉపాధ్యాయ , ప్రజాసంఘాలు కూడా మద్దతు తెలిపారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాలనుసారం ఆర్థిక సంస్కరణల అమల్లో భాగంగా గతంలో 2004 లో ఎన్‌డిఎ ప్రభుత్వం పిఎఫ్ఆర్‌డిఎ బిల్లును తీసుకువచ్చింది . ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీంను రద్దుచేసి సిపిఎస్ విధానాన్ని తెరమీదకి తీసుకువచ్చారు. అనంతరం ముఖ్యమంత్ర వైఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని అమలు చేస్తూ ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సిపిఎస్ విధానం రద్దు పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోవడంతో ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన జగన్మోహన్ రెడ్డి ఈ విధానానికి రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఒపిఎస్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. నాలుగున్నర సంవత్సరాల పాటు మంత్రుల కమిటీ పేరుతో కాలయాపన చేశారు. ఇప్పుడు సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అమలు చేస్తామని ప్రకటిస్తూ అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టారు. జిపిఎస్ విధానం ఉద్యోగులకు ఉపాధ్యాయులకు గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ కాదని ఉద్యోగ ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు పదవి విరమణ చెందిన అనంతరం పెన్షన్ వస్తుందో లేదో కూడా గ్యారెంటీ ఇవ్వలేనటువంటి ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేందుకు పూనుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిపిఎస్ బిల్లును కూడా ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తుంది. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ చేపడుతున్న పోరాటానికి ప్రతిపక్ష పార్టీలు సిపిఎం తెలుగుదేశం ఉపాధ్యాయ సంఘాలు ఎస్‌టియు, ఎపిటిఎఫ్ 1938, జన విజ్ఞాన వేదిక ప్రజా సంఘాలు, సిఐటియు, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ తదితర సంఘాలు కూడా మద్దతు తెలిపాయి.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి
ఎల్లప్ప, జిల్లా అధ్యక్షుడు యుటిఎఫ్

జిపిఎస్ బిల్లు సిపిఎస్ కు ఎలాంటి తేడా లేదు. ఈ రెండు విధానాలు ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షన్ పొందే భద్రత కల్పించే విధంగా లేవు. ఈ రెండు విధానాలను ఉపసంహరించుకొని ఒపిఎఎస్ విధానాన్ని అమలు చేయాలి. ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షన్ అందించేంతవరకు యుటిఎఫ్ పోరాటాన్ని విరమించేది లేదు.

సిఎం హామీ నెరవేర్చాలి: ఇబ్రహీం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసగించారు. ప్రస్తుతం తీసుకువచ్చిన జిపిఎస్ కూడా నష్టదాయకంగానే ఉంటుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.

జిపిఎస్ సిపిఎస్ రెండు నష్టమే: రంగన్న

గ్యారెంటీ పెన్షన్స్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ అందే గ్యారంటీ లేదు. సిపిఎస్ జిపిఎస్ రెండు స్వరూపాలు ఒకటే. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలి.

ఒపిఎస్ సాధించేంత వరకు పోరాటం: నరసింహ

ఉద్యోగ,ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు పోరాటం ఆగదు. సిపిఎస్ జిపిఎస్ విధానాలను ఉపసంహరించకపోతే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

ఒపిఎస్ తోనే న్యాయం: దావీదు

ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయడం ద్వారానే న్యాయం జరుగుతుంది. సిపిఎస్ ,జిపిఎస్ విధానాల వల్ల పెన్షన్ అందడం కష్టతరమే. అందుకే ఈ రెండు విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

జోగులాంబకు కలెక్టర్ పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్రంలోని అలంపూర్ శ్రీ జోగుళాంబ అమ్మవారికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పట్టువస్త్రాలు సమర్పించారు. దేవి శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మూలా నక్షత్రంలో అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున కర్నూలు జిల్లా కలెక్టర్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ప్రతి ఏటా పట్టు వస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బలరామయ్య, సుగుణ, అత్త మామలు శంకర్ రెడ్డి, సుహాసిని, భర్త రవితేజ, కుమారుడు విహాన్, ఇతర బంధు మిత్రులతో కలిసి కలెక్టర్ పూజలు చేశారు. తొలుత శ్రీ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ చిన్నికృష్ణ , దేవస్థానం కార్యనిర్వహణాధికారి పురేందర్ కుమార్, కర్నూలు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు కలెక్టర్ దంపతులు, కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తొలుత శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామికి పూజలు,అభిషేకం చేశారు. అనంతరం పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చకులు ఆశీర్వచనం అందచేసిన అనంతరం శ్రీ జోగుళాంబ బ్రహ్మేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో కలెక్టర్ దంపతులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, డిప్యూ టి మేయర్

జగనన్న ప్రభుత్వాన్ని దీవించండి

విరామం లేకుండా 'గడపగడపకు' ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జగనన్న ప్రభుత్వాన్ని మరోమారు దీవించాలని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్ ఖాన్ ప్రజలను కోరారు. శుక్రవారం ఆయన కర్నూలు నియోజకవర్గ పరిధిలోని ఆయా వార్డులలో రోజంతా విరామం లేకుండా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, వారి సమస్యలను ఓపిగ్గా వింటూ తిరిగారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేదాకా ప్రజలమధ్యనే ఉన్నారు. ఎమ్మెల్యే , డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణ, నాయకులు కాలనీలోని ప్రతిగడపకు వెళ్లి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రైల్వే ప్రసాద్, భారతి, సుధాకర్, సందీప్, లక్ష్మణ్, లాజర్, బాషా, నాగరాజ్, నజీర్, అబ్దుల్లా, ఏసు, కిరణ్, అక్బర్, ఇమ్మి, స్థానిక వైసిపి నాయకులు, నియోజకవర్గ పరిధిలోని పలువురు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది, ఆర్‌పి లు సంబందిత అధికారులు పాల్గొన్నారు.

వరిసూగుపై సూచనలు, సలహాలు ఇస్తున్న ఇఒ మల్లేష్

వరి సాగులో మెళకువలు పాటించాలి : ఎఒ

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం కొండాపురలో ఎఒ మల్లేష్ కుమార్ శుక్రవారం వరి పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక్కడే సిబ్బంది సోమేశ్వరి, రాజశేఖర్ నాయక్, వెంకటేశ్వర్లు సమక్షంలో రైతులకు వరి పంటలపై, పొలంబడిపై మెలకువలు పాటించాలని సూచించారు. అలాగే పచ్చదోమ, తెల్లదోమ ఉధృతి పెరిగిందని, జిగురు అట్టలు ఉపయోగించాలని పేర్కొన్నారు.

కొనసాగిన యుటిఎఫ్ దీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్/ కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు డిమాండు చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నా చౌక్ దగ్గర జరుగుతున్న నిరవధిక దీక్షల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జిపిఎఫ్ విధానాన్ని తీసుకుని రావడంలో అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం కలిపి ఉద్యోగులకు నష్టదాయకమైన విధానాలు అనుసరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 78 రోజులు బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించిందని, వాస్తవంగా 30 లక్షలుగా ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా ఉన్న 11 లక్షల మందితోనే పని చేయించుకుంటుందని తెలిపారు. ఖాళీగా ఉన్న వారి స్థానాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిన కొనసాగిస్తూ లక్షల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం పోగు చేసుకుంటుందని అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి బోనస్ ప్రకటించి ఉంటే సంతోషించే వారమని అన్నారు. పాత పెన్షన్ స్కీము కోసం ఉపాధ్యాయులు చేస్తున్న ఆందోళన ఉపాధ్యాయ ఉద్యమంలో మైలురాయి వంటిదని తెలిపారు. ఈ ఉద్యమానికి సిఐటియు ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సుధాకరప్ప, యేసు, చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకుడు మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

దీక్షలకు పలువురి సంఘీభావం

కష్ణదేవరాయ సర్కిల్లోని ధర్నా చౌక్‌లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక దీక్షలు శుక్రవారం కూడా రెండో రోజు కొనసాగాయి. ఈ దీక్షలో కూర్చున్న యుటిఎఫ్ నాయకులకు సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, ఓల్డ్ సిటీ సెక్రెటరీ రాజశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు జిల్లా నాయకులు రామాంజనేయులు ఓల్డ్ సిటీ సెక్రెటరీ మారెళ్ళ విజయ రామాంజనేయులు సుధాకరప్ప లతోపాటు జెవివి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుదీర్ రాజు, ఖాజా హుస్సేన్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగారం మోహన్, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, చిన్న వ్యాపారస్తుల సంఘం సంఘాలు నాయకులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు హామీ ఇచ్చిన సిపిఎస్, జిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తూ ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో కూర్చున్న వారిలో జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప జిల్లా నాయకులు దావీదు ,నరసింహ, ఇబ్రహీం, రంగన్న ఉన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, జిల్లా సహ అధ్యక్షుడు, రవికుమార్, ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ యెఎహోషువ, జిల్లా కార్యదర్శి నవీన్ పాటీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి

గాయపడిన రైతును పరామర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నగరంలోని సర్వజన వైద్యశాల సూపర్ స్పెషాలిటీ బ్లాక్ న్యూరో సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న అనంతపుం జిల్లాకు చెందిన రైతు నరసింహులును కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం పరామర్శించారు. అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం ఆవులెన్న గ్రామానికి చెందిన రైతు నరసింహులు ఈ ఏడాది మే 28న కళ్యాణదుర్గం మండలం చాపిరి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై జ్ఞాపకశక్తి కోల్పోయారు. వారి కుటుంబం ఆర్థిక సహాయం కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎమ్మిగనూరు పర్యటనలో కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నరసింహులును పరామర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు సర్వజన వైద్యశాలలో గత మూడు వారాలుగా నరసింహులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. అవసరమైన చికిత్సను డాక్టర్లు అందిస్తున్నారని పేర్కొన్నారు. వేరే ఎక్కడైనా అత్యున్నతమైన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పేషెంట్ కుటుంబ సభ్యులను వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్స్ సంబంధిత అధికారులకు అందజేయాల్సిందిగా చెప్పారు. అవసరమైతే వైద్యుల సలహాలు సూచనలతో కూడిన రిపోర్టు ముఖ్యమంత్రికి అందజేస్తామని తెలిపారు. పేషెంట్ కు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇప్పటివరకు రూ.6,50,000 ఆర్థిక సహాయం అందినట్టుగా తెలిపారు.

మాట్లాడుతున్న టిజి.భరత్

ఐదేళ్ల జీవితం ప్రజల చేతుల్లోనే : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఐదేళ్ల బంగారు జీవితం ప్రజల చేతుల్లోనే ఉందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. ఎలాంటి నాయకుడిని ఎన్నుకోవాలో ప్రజలే ఆలోచించుకోవాలని చెప్పారు. కర్నూలు నగరంలోని జొహరాపురం అల్లా బకాష్ కాలనీలో ఆర్య మరాఠీ సంఘం నాయకులు టిడిపికి మద్దతు ఇస్తూ టిజి భరత్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన వారికి కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. టిజి.భరత్ మాట్లాడుతూ కర్నూల్లో తొమ్మిదిన్నర సంవత్సరాల పాలన ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలన్నారు. తన తండ్రి టిజి వెంకటేష్ పాలనకు ఆ తర్వాత పాలనకు ఎంతో తేడా ఉందన్నారు. చిన్న సమస్యలు పరిష్కరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్య మరాఠీల కోరిక మేరకు రాజకీయాలతో సంబంధం లేకుండా అమ్మవారి ఆలయ నిర్మాణం త్వరలోనే చేపడతానని భరత్ హామీ ఇచ్చారు. కర్నూలు ప్రజలకు సేవ చేసేందుకు తమ కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కర్నూలుకు పరిశ్రమలు తీసుకువచ్చి ఇక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బాబ్జీ, మోహన్, మాధవస్వామి, శాంతమ్మ, ఆర్య మరాఠీ సంఘం నేతలు శేఖర్, బాల్ రాజ్, బలరాం, గంగారం, చంద్రరాజ్, బ్రహ్మాజీ, గంగాధర్ పాల్గొన్నారు.

పట్టా దారు పాస్‌బుక్ ఎప్పుడిస్తారు?

తహశీల్దార్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్న వృద్ధుడు

ప్రజాశక్తి-పత్తికొండ : పట్టాదారు పాసుపుస్తకం ఎప్పుడిస్తారని ఓవృద్ధుడు పత్తికొండ తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ఏళ్లతరబడి తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తహశీల్దార్ కార్యాలయం కార్యకలాపాలు అందడానికి అగచాట్లు తప్పడం లేదు. పత్తికొండ మండలం పెద్దహల్తి గ్రామానికి చెందిన పూజారి బ్రహ్మయ్య(65) సర్వే నంబర్ 29సి 3.40 పట్టాదారు పాస్ పుస్తకం కోసం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ కొన్ని ఏళ్లుగా తిరుగుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్‌కు, వీఆర్వోకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని కార్యాలయం చుట్టూ తిరగలేక మానసికంగా ఇబ్బంది పడుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. . జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో రెండుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. పాస్ పుస్తకం లేకపోవడంతో ప్రభుత్వం అందించే నష్టపరిహారం, రైతు భరోసా పిఎం కిసాన్ అనేక సంక్షేమ పథకాలు అందడం లేదని , గత సంవత్సరం పంట సాగు చేసి పంట నష్టం జరిగిన పరిహారం అందలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

సామాజిక తనిఖీలో రూ.6,662 రికవరీ

- ఉపాధి హామీ పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉపాధి హామీ చట్టం మండలంలో 12 జిపిలలో రూ.6,662 రికవరీ చేసినట్లు ఉపాధి హామీ పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎపిఓ మాధవ శంకర్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలోని అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తనిఖీ అధికారులతో కలిసి బహిరంగ వేదిక నిర్వహించారు. ఈ బహిరంగ వేదికలో 12 జిపిలలో ఈ ఆర్థిక సంవత్సరంలో గాను ఉపాధి పనులు జరిగిన ప్రదేశాల్లో అవినీతి, అక్రమాలు ఏమైనా జరిగాయా అని వారం రోజుల నుంచి గ్రామాల్లో రికార్డులు పరిశీలించారు. బహిరంగ వేదిక నిర్వహించారు. రూ.6,178 జరిమానా విధించినట్లు పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రామదుర్గం, కాజీపురం గ్రామాల్లో కొంతవరకు అవకతవకలు జరుగగా విచారణలో వెల్లడైన మొత్తాన్ని రికవరీ చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ బహిరంగ వేదిక నిర్వహించినట్లు తెలిపారు. వలసల నివారణ ధ్యేయంగా ప్రతి కూలీకి పని కల్పించాల్సిన బాధ్యత ఉపాధి అధికారులపై ఉందన్నారు. ఎంపిడిఒ కొండయ్య, ఏపీడీ పకీరప్ప, ఎస్‌ఆర్‌పి మల్లికార్జున పాల్గొన్నారు.

వైసిపికి ఓటమి తప్పదు : టిడిపి

ప్రజాశక్తి - కోసిగి

వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటమి తప్పదని టిడిపి నాయకులు తెలిపారు. టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం కోసిగిలోని 9వ వార్డు దుర్గా నగర్ వడ్డే గేరి వీధుల్లో 'బాబుతో నేను' నిర్వహించారు. మండల అధ్యక్షులు జ్ఞానేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వైసిపి వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో టిడిపి అధినేత చంద్రబాబు జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని తెలిపారు. ప్రజలంతా చంద్రబాబుకు మద్దతు పలకడాన్ని చూసి ముఖ్యమంత్రి జగన్ జీర్ణించుకోలేక స్కిల్ డెవలప్‌మెంట్ అంశాన్ని తెరపైకి తెచ్చి అబద్ధాల ప్రచారం చేస్తున్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం నిరాధార ఆరోపణలతో కక్ష పూరితంగా చంద్రబాబును అరెస్టు చేయించిందని విమర్శించారు. లేని స్కామ్‌ను సృష్టించి చంద్రబాబును ఇరికించారని తెలిపారు. జగన్ పాలనలో కక్ష సాధింపులే తప్ప అభివృద్ధి లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించి ఇంటికి సాగనంపాలని కోరారు. టిడిపి మండల నాయకులు ఎస్సీ సెల్ నాయకులు ఎస్.మద్రెప్ప, పంపాపతి, కొండగేని వీరారెడ్డి, నాడిగేని వీరారెడ్డి, వడ్డే రామయ్య, ఉమర్ సాబ్, గాంధీనగర్ శీను, కోడి పెద్దఈరన్న, మునెయ్య పాల్గొన్నారు.

జాలర్లకు చిక్కిన మొసలి

ప్రజాశక్తి - ఆదోని

మొసలి సంచారంతో ఎస్ఎస్ ట్యాంకులో మరమ్మతు పనులు చేపట్టేందుకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం జాలర్లు వేసిన వలకు మొసలి పట్టుబడింది. గతంలో ఈ మొసలిని పట్టుకోవడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఆదోని పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం పట్టణ శివార్లలో బసాపురం గ్రామం వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించారు. ట్యాంకులో మొసలి సంచరిస్తుందని ఏడాది క్రితం సిబ్బంది గ్రహించి, విషయాన్ని ఆదోని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి తెలిపారు. అప్పటి నుంచి పట్టుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇటీవల ట్యాంకులో నీటిని నింపడానికి ఇసుక సంచులతో ప్రత్యేక బండ్ ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. మొసలి భయం ఉండడంతో పనులు చేసేందుకు కూలీలు, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. శుక్రవారం జాలర్లు నీటిలోకి బోట్ ద్వారా దిగి గాలించగా మొసలి వలలో పడింది. సిబ్బంది బయటికి తీసుకొచ్చారు. మొసలి పట్టుబడడంతో సిబ్బంది, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ఫారెస్ట్ అధికారులను పిలిపించి మొసలిని అప్పగించారు. ఇంకా రెండు మొసలి పిల్లలు ఉన్నాయని, వాటిని కూడా త్వరలో పట్టుకుంటామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తులపై

ప్రకాశం జిల్లా పోలీసుల ఆరా

మంత్రాలయం : అదృశ్యమైన వ్యక్తుల వివరాలను సేకరించే పనిలో ప్రకాశం జిల్లా పోలీసులు పడ్డారు. శుక్రవారం స్థానిక శ్రీమఠం నిర్వహణలో ఉన్న వివిధ వసతి గృహాల విచారణ కార్యాలయాల్లో, ప్రయివేట్ లాడ్జీల్లో మార్కాపురం ఎస్ఐ షేక్ మునాఫ్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2018-23 మధ్య ప్రకాశం జిల్లాలో సుమారు 120 మంది అదృశ్యమైనట్లు కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇందులో అమ్మాయిలు, అబ్బాయిలు, పెళ్లి కాని యువతులు, యువకులు, మహిళలు, వృద్ధులు ఉన్నారని చెప్పారు. జిల్లా ఎస్పీ మల్లికా గర్గ, అడిషనల్ ఎస్పీ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు జిల్లాలోని ఒంగోలు, దర్శి, మార్కాపురం, కనిగిరి డివిజన్ల నుంచి నాలుగు బృందాలుగా ఏర్పడి అదృశ్యమైన వ్యక్తుల వివరాలను, ఫొటోలను చూపిస్తూ ఆరా తీస్తున్నామని తెలిపారు. అదృశ్యమైన వ్యక్తుల వివరాల తెలిసిన వారు 8074526525 ఫోన్ నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు. ఆయన వెంట పోలీసు సురేష్ ఉన్నారు.

రేషన్ బియ్యం ఇవ్వాలి

- సిపిఎం సీనియర్ నాయకులు నారాయణస్వామి
- తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మండలం అగ్రహారం గ్రామంలో కార్డు దారులకు రేషన్ బియ్యం వేయాలని సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, మండల కార్యదర్శి షాకీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో అగ్రహారం గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలూరు మండలం అగ్రహారం గ్రామంలో 20వ తేదీ వచ్చినా ఇప్పటి వరకు ప్రజ పంపిణీకి సంబంధించిన రేషన్ బియ్యం, ఇతర సరుకులు వేయలేదని మండిపడ్డారు. గ్రామంలోని 18వ రేషన్ షాపు పూజ కార్డుదారులకు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. 'రేషన్ రాలేదు.. ఎవరికైనా చెప్పుకోండి' అని అనడం ఏమిటని ప్రశ్నించారు. గత కొన్నేళ్లుగా రేషన్ తప్ప ఏ ఇతర సరుకులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే వర్షాలు లేక, పని దొరకక, ఏమీ చేయలేని స్థితిలో ఉన్న నిరుపేదలకు రేషన్‌ను కూడా వేయలేకపోతే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ అందిస్తున్నాం అంటూ గొప్పలు చెప్పడానికే పరిమితం అయిందని విమర్శించారు. ప్రజాపంపిణీపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్, ఇతర సరుకులు వేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఫీల్డ్‌కు వెళ్లిన తహశీల్దార్ రావడంతో వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ స్పందిస్తూ... అగ్రహారం గ్రామంలో బ్యాక్‌లాగ్ బియ్యం ఉండడం వల్ల రేషన్ అలాట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ఉండేందుకు బియ్యాన్ని అలాట్‌మెంట్ చేయాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే వరకు పేదలను దృష్టిలో ఉంచుకొని ఇతర రేషన్ షాపుల బ్యాక్ లాగ్‌లో ఉన్న బియ్యాన్ని తెప్పించి సాయంత్రం 5 గంటల్లోపు పంపిణీ చేస్తామని వివరించారు. సిపిఎం నాయకులు గోవర్ధన్, గ్రామస్తులు చంద్ర, కృష్ణ, నాగరాజు, చెన్నమ్మ, సుంకమ్మ, నాగవేణి, వీరేష్ పాల్గొన్నారు.

ముట్టడిలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాధనం దుర్వినియోగం

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి తనయుడు టిక్కెట్‌పై ఉన్న ఆరాటం, నియోజకవర్గ అభివృద్ధిపై లేదు : టిడిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

'జగనన్న చేదోడు' నాలుగో విడత ప్రారంభానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎమ్మిగనూరుకు రావడంతో ప్రజాధనం దుర్వినియోగమైందని, ప్రజలకు ఒరిగిందేమీ లేదని టిడిపి నాయకులు మండిపడ్డారు. కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం కోట్ల క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులైన వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం, ఎల్ఎల్‌సి, అండర్ గ్రౌండ్ పైపులైన్ పనుల గురించి సభలో ముఖ్యమంత్రి జగన్ ప్రస్తావించకపోవడం జిల్లాపై ఆయనకు ఉన్న ప్రేమ ఏ పాటిదో అర్థమవుతుందని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి హంద్రీనదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలన్న వినతి మినహాయిస్తే, నియోజకవర్గ అభివృద్ధి కోసం అడిగింది శూన్యమన్నారు. ఆయన తనయుని టికెట్‌పై ఉన్న ఆరాటం అభివృద్ధిపై లేకపోవడం శోచనీయమన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు సహకారంతో, కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి నేతృత్వంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలిపారు. టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, ఆత్మ మండల మాజీ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, మాసుమాన్‌దొడ్డి శ్రీనివాసులు, తెలుగు మహిళా నాయకులు గోకారమ్మ, టిడిపి ముస్లిం, మైనార్టీ నాయకులు కెఎమ్‌డి.అబ్దుల్ జబ్బార్, ఆఫ్ఘాన్ వలిబాష, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు దర్జీ మోషన్న, ఎస్.సాల్మన్, జాలవాడి ఏసన్న, పందికోన సురేష్, కె.తిమ్మాపురం గ్రామ నాయకులు కురువ వీరేష్, మార్కు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోతున్నాయి.. కాపాడండి..!

- రైతుల విన్నపం
- అందరికీ న్యాయం చేస్తాం : ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ఎంతో కష్టపడి సాగు చేసిన పంటలు సాగునీరందక కళ్ల ముందరే ఎండిపోతున్నాయని, కాపాడాలని మండలంలోని హాల్వి, గోతులదొడ్డి, అగసలదిన్నె రైతులు వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.ప్రదీప్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం మండలంలోని కామంరం గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎంతవరకు అందుతున్నాయో, ఇంకా ఎవరైనా అర్హులైన వారు ఉంటే వారికి అందించడానికి కృషి చేస్తామని ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే స్థానిక నాయకులు వీర సేనా రెడ్డి, మహేందర్ రెడ్డి దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం హాల్వి, గోతులదొడ్డి, అగసలదిన్నె రైతులు అక్కడికి వచ్చి తమ ఆయకట్టు నీటి సమస్య గురించి వివరించారు. హాల్వి గోతులదొడ్డి గ్రామాల్లో 860 ఎకరాల్లో వరి, పత్తి, మిరప పంటలు సాగు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు చుక్క నీరు కూడా ఆయకట్టుకు రాలేదని, పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. ఎలాగైనా సాగునీరందించి కాపాడాలని కోరారు. రైతుల సమస్యలు విన్న ప్రదీప్ రెడ్డి, మహేందర్ రెడ్డి తుంగభద్ర దిగువ కాలువ అధికారులతో చర్చించారు. వారం రోజుల్లో ఆయకట్టుకు సాగునీరందించి రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి సహకారంతో తుంగభద్ర దిగువ కాలువ నీరందించి పంటలు కాపాడతామని హామీ ఇవ్వడంతో రైతులు సంతోషించారు. వీరసేనారెడ్డి, వెంకట్ రెడ్డి, ఎంపిపి అమ్రేష్, సర్పంచి వసంత కమార్, ఎంపిడిఒ సుబ్బరాజు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ప్రదీప్ రెడ్డి

నాగలదిన్నెలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

- ఓ మహిళకు గాయాలు, ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - నందవరం

దాడులకు పాల్పడుతున్న ఇరు వర్గాలు

నాగలదిన్నె గ్రామంలో ఓవైపు వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయాలని, వద్దు అంటూ మరో వర్గం ఆపడంతో ఇరు వర్గాలు దాడులు చేసుకున్నాయి. మండలంలోని నాగలదిన్నె గ్రామంలో పెద్దమ్మ అవ్వ గుడి వెనకాల ఉన్న రేకుల షెడ్డు స్థలంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయాలని వాల్మీకులు, ఆ స్థలం పెద్దమ్మ అవ్వ దేవాలయానికి సంబంధించిందని వడ్డెర కులస్తులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. గ్రామస్తుల వివరాల మేరకు... పెద్దమ్మ దేవాలయం వెనకాల ఉన్న రేకుల షెడ్డు స్థలంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయాలని గత నాలుగు రోజుల క్రితం వడ్డెర సంఘం పెద్దలకు వాల్మీకి సంఘం పెద్దలు సమాచారం అందించారు. ఎలాంటి సమాధానమూ రాకపోవడంతో వాల్మీకులు అందరూ కలిసి రేకుల షెడ్డును తొలగించేందుకు ప్రయత్నించారు. వడ్డెర సంఘం వాళ్లు అడ్డుకున్నారు. ఇరువర్గాలు కోపోద్రిక్తులై ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లు, కారంతో దాడులు చేసుకున్నారు. ఆ దాడిలో వడ్డే మహదేవమ్మకు గాయాలు కాగా, ఆమెను ప్రభుత్వాస్పత్రి తరలించారు. సమస్య చేయి దాటుతుందని సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చల్లాచెదురు చేశారు. ఇరు వర్గాలకు గొడవలు సృష్టించడంలో ఓ మాజీ సర్పంచి హస్తం ఉందని, ఆయన మరో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారని సమాచారం రావడంతోనే వాల్మీకులు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుగా ప్రయత్నం చేశారని ప్రజలు పేర్కొంటున్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి...

- ఆదోని, ఎమ్మిగనూరులో యుటిఎఫ్ నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - ఆదోని

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాది లింగప్ప, సీనియర్ నాయకులు పాపయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోనిలోని విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, సునీల్ రాజ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో పాదయాత్ర సందర్భంగా సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వారంలోపు పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సిపిఎస్‌ను రద్దు చేసేంత వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. దీక్షలకు ఎస్‌టియు నాయకులు నాగరాజు, నరసింహులు, సుంకన్న, రవికుమార్, గోపాల్, రమేష్ నాయుడు, సిపిఎం నాయకులు గోపాల్, సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు శిబిరం వద్దకు చేరుకొని సంఘీభావం తెలిపారు. జిల్లా ఆడిట్ సభ్యులు శ్రీనివాసులు, మల్లికార్జున, ఆదోని నాయకులు రామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి ఓంకార్, ఆలూరు బాధ్యులు బసవరాజ్, మంగయ్య, చంద్రశేఖర్ నాయుడు దీక్షల్లో కూర్చున్నారు. **ఎమ్మిగనూరు**లోని సోమప్ప సర్కిల్‌లో నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మల్లారి నాగరాజు, హనుమంతు, రాఘవేంద్ర మాట్లాడారు. సిపిఎస్‌ను రద్దు చేస్తామని జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో హామీ ఇచ్చారని తెలిపారు. ఉపాధ్యాయులు కౌలన్న, చంద్రపాల్, బాబు, రాజు, లక్ష్మన్న, భాగ్యరాజు, విజయ్, రాజు, రంగన్న, వెంకట్రాముడు దీక్షల్లో కూర్చొన్నారు. సిఐటియు డివిజన్ అధ్యక్షులు గోవిందు, రాముడు, కెవిపిఎస్, ఐలు, వ్యకాస తదితర ప్రజాసంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారు.

ఆదోనిలో దీక్షలు చేపడుతున్న నాయకులు

అగ్ని వీరులను అభినందిస్తున్న ప్రదీప్‌రెడ్డి

'అగ్ని'వీరులకు అభినందన

ప్రజాశక్తి - మంత్రాలయం

అగ్నివీరుల పేరుతో సైనికులుగా ఎంపికైన వారిని వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై.ప్రదీప్ రెడ్డి అభినందించారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో ఆయనను కలిసి శాలువా, పూలమాల వేసి సన్మానించిన సందర్భంగా ఆయన అగ్నివీరులకు అభినందనలు తెలిపారు. అగ్నివీర్ ఎంపిక కోసం నిర్వహించిన పోటీ పరీక్ష, దేహదారుఢ్య, మెడికల్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి, అగ్నిపథ్ స్కీంలో (విజిఎస్ఎ) విజేత గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులు 12 మంది ఎంపిక కాగా వీరిలో నలుగురు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించారు. మహేంద్ర నాయుడు, మహబూబ్ బాష, సురేష్ నాయక్, శివప్రసాద్, శివ, రాజేష్, వెంకటేష్, రాంబాబు, బాలు, రఘురెడ్డి, రఘువీర్, నరసింహులు ఎంపికయ్యారు. అభ్యర్థుల్లో ఆత్మ విశ్వాసం నింపుతూ ముందుకు నడిపించిన కోచ్ మల్లికార్జున, అభ్యర్థులకు అభినందనలు తెలిపారు.

పంట కాలువలు పూర్తి చేసి సాగునీరందించాలి

- సిఎంకు శాంతి కుమార్ వినతి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలో హంద్రీ నీవా పంట కాలువల నిర్మాణ పనులు పూర్తి చేసి 40 వేల ఎకరాలకు సాగునీరందించాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాకర్ల శాంతి కుమార్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. 'జగనన్న చేదోడు' కార్యక్రమానికి ఎమ్మిగనూరుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని హెలిప్యాడ్ వద్ద కలిసి విన్నవించినట్లు తెలిపారు. వెనుకబడిన దేవనకొండ మండలంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద ఆయకట్టు స్థిరీకరణ పనులు చేపట్టి పంట కాలువల ద్వారా మండలంలోని పొలాలకు సాగునీరు, మండల ప్రజలకు తాగునీరందించాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు.

పసుపు నీళ్లతో సిఎం సభ స్థలం శుద్ధి

- ఎమ్మిగనూరుకు ఏం చేశారు
- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రసంగించిన సభ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పసుపు నీళ్లతో శుద్ధి చేసి నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక వీవర్స్ కాలనీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయం నుంచి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సిఎం సభ స్థలం వరకు బిందెలతో పసుపు నీళు చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరులో సిఎం జగన్ పర్యటనతో గ్రౌండ్ స్థలం అపవిత్రమైందని, అందుకే పసుపు నీళ్లతో శుద్ధి చేశామని తెలిపారు. ఎమ్మిగనూరుకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సిఎం ప్రజలను మభ్యపెట్టే మాటలు మాట్లాడారని చెప్పారు. ఎమ్మిగనూరుకు ఏం అభివృద్ధి చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలకు పరిష్కారం చూపకుండా అవసరం లేని బ్రిడ్జి మంజూరు చేయడం సిగ్గు చేటన్నారు. అనంతరం పట్టణ ఎస్ఐ రమేష్, పోలీసులతో కలిసి వచ్చి శుద్ధి కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల జోక్యంతో జయనాగేశ్వర రెడ్డితో పాటు టిడిపి శ్రేణులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. టిడిపి నాయకులు కొండయ్య చౌదరి, రామదాసు గౌడ్, దయాసాగర్, రామకృష్ణ నాయుడు, రంగస్వామి గౌడ్, మధుబాబు, మల్లికార్జున, బచ్చాల రంగన్న, కలీముల్లా, నజీర్ అహ్మద్, శిల్పి భాస్కర్, బిజ్జె నాగరాజు, కటారి రాజేంద్ర, కృష్ణతేజ నాయుడు, శంకర్ గౌడ్, ఉప్పర రవి కుమార్, అల్తాఫ్, దేవేంద్ర, ఎరుకల పరమేష్, గోనెగండ్ల చంద్రశేఖర్, దేవదాసు, జయన్న, ఈశ్వర్, రాజు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

జగనన్న సురక్ష.. ప్రజారోగ్యానికి రక్ష

- సర్పంచి శంకరమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి

'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రజల ఆరోగ్యానికి రక్ష అని సర్పంచి శంకరమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని తంగరడోణ గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కుటుంబంలోని ప్రతిఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'ఆరోగ్య సురక్ష'ను చేపట్టారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ బాలకృష్ణా రెడ్డి మాట్లాడుతూ... తంగరడోణ గ్రామంలో 554 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. స్పెషలిస్టులు కల్పన, శశి కిరణ్, డాక్టర్లు మాధవి లత, టిడిపి ఎంపిటిసి నరసప్ప, వైస్ సర్పంచి తిక్కయ్య, విఆర్‌ఒ రామాంజినేయులు, సచివాలయ కన్వీనర్లు రాజన్న, పాండు, నరసన్న, నల్లన్న, మునిస్వామి, ఓబులేసు, రంగన్న పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలం జాలవాడి గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. సర్పంచి మల్లమ్మ, ఉప సర్పంచి హుసేని, వైసిపి నాయకులు ఆంజనేయులు మాట్లాడారు. 9 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. పిఎస్‌లు లక్ష్మీ, మహేంద్ర పాల్గొన్నారు. **నందవరం** మండలంలోని ముగతిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. 465 మంది వారి ఆరోగ్య సమస్యలపై సంప్రదించారని తెలిపారు. 17మంది గర్భిణులు, 46 మంది కంటి పరీక్షలు చేయించుకోగా, 15 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ముగతి సర్పంచి, వైసిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు విరుపాక్షి రెడ్డి, ఎంపిడిఒ దశరథ రామయ్య, డాక్టర్లు టి.పరిమళ, డాక్టర్ టి.శైలవాను, డాక్టర్ పి.సౌజన్యలత పాల్గొన్నారు.

ఆస్పరిలో మాట్లాడుతున్న డాక్టర్ బాలకృష్ణా రెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రామకృష్ణ

జిల్లాకు వర్షాలు సకాలంలో రాక ఖరీఫ్‌లో వేసుకున్న పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలూరుకు వచ్చిన రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గిడ్డయ్య ఆలూరులోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం హంగు, ఆర్భాటాలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని తెలిపారు. జిల్లాలో వర్షాలేక రైతులు అప్పుల చేసి పంటలు వేస్తే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం అందించి, బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు కె.భూపేష్, సిపిఐ మండల కార్యదర్శి పి.రామాంజనేయులు, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, ప్రజాసంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం ధనాపురం గ్రామంలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతం ఆదోని, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు విలయ తాండవం చేస్తోందన్నారు. ఈ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం అలమటిస్తున్నారని తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మారెడ్డి, సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావిరాజు, పట్టణ, మండల సహాయ కార్యదర్శులు చిన్న నరసప్ప, విజయ్, హర్షద్ వలీ, రైతు సంఘం నాయకులు ఎల్లప్ప, కౌలు రైతు సంఘం నాయకులు సత్యనారాయణ, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి ఎంకప్ప, పట్టణ అధ్యక్షులు వైటి.భీమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాబీర్ బాష, ప్రజాసంఘాల నాయకులు హనుమంతు, కరెంటు ఈరన్న, ఎఐవైఎఫ్ నాయకులు అంజి, రమేష్, ఎఐటియుసి జిల్లా సమితి సభ్యులు షేక్షావలీ పాల్గొన్నారు.

2024లో విజయం తథ్యం : వైసిపి

ప్రజాశక్తి - చిప్పగిరి

సిఎంతో ఉన్న మారయ్య

వచ్చే 2024 ఎన్నికల్లో వైసిపి విజయం సాధించడం తథ్యమని వైసిపి కన్వీనర్ జూటూరు మారయ్య తెలిపారు. శుక్రవారం ఆయన చిప్పగిరిలో విలేకరులతో మాట్లాడారు. 'వైసిపి అభివృద్ధి కోసం కష్టపడి పని చేయండి. నేనున్నాను. ప్రజలతో మమేకం కావాలి' అని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎమ్మిగనూరు పర్యటనలో భాగంగా ఆలూరు బ్రాంచి కెనాల్, రైతుల తాగు, సాగునీటి కష్టాలను ముఖ్యమంత్రికి వివరించినట్లు చెప్పారు. జనవరి చివరి వరకు ఆలూరు బ్రాంచి కెనాల్‌కు సాగునీరు విడుదల చేయాలని అక్కడున్న సంబంధిత ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి, పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని తెలిపినట్లు చెప్పారు. ఇది రైతు ప్రభుత్వమని, రైతుల కోసం ఎన్ని కష్టాలైనా పడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆలూరు బ్రాంచి కెనాల్‌కు నీరు రావడం లేదని రైతులు తన దృష్టికి చాలాసార్లు తెచ్చారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రైతులు ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం లేదని, సాగు, తాగునీరు పుష్కలంగా అందుతుందని తెలిపారు. వైసిపి నాయకులు ధనుంజయ, లాల్ స్వామి, లింగన్న పాల్గొన్నారు.

సిఎం జగన్‌ను కలిసిన వహాబ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

హీరో కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు ప్రిన్స్ వహాబ్ పట్టణంలోని హెలిప్యాడ్ గ్రౌండ్ వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రితో ప్రిన్స్ వహాబ్ గతంలో హీరో కృష్ణ, మహేష్ ఫ్యాన్స్ తరఫున తను ప్రచారం చేసిన విషయాలను సిఎంకు వివరించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'నీ పేరు కూడా మహేష్ బాబేనా..' అంటుండగా వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి జోక్యం చేసుకొని వహాబ్ అంటూ ముఖ్యమంత్రికి చెప్పారు. వెంటనే జగన్ చిరునవ్వుతో 'ఓకే వహాబ్... వెల్‌డన్' అంటూ భుజం తట్టారు.

సిఎం జగన్‌తో ప్రిన్స్ వహాబ్

మహారాజ శ్రీ కర్నూలు 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.యస్.నెం. 290/2019

యం సునీత. ...వాది

-Vs-

పురవాకిటి శ్రీనివాసరెడ్డి తండ్రి పి.క్రిష్ణరెడ్డి,
వ్యాపారం, ఇంటి.నెం.4-22-10, బాలాజీనగర్,
స్టాంటన్‌పురం గ్రామం, కర్నూలు (మం),
కర్నూలు జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 12,31,920/-లు, ఇందులో రూ.8,70,000/-లపైన దావా దాఖాలు చేసిన తేది నుండి 23% ప్రకారం వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినది. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 02-11-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

యస్.చాంద్ బాష,
వాది పరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు 7వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

ఓ.యస్.నెం.10/2023

కురువ మద్దిలేటి. ...వాది

-Vs-

జి.గోపినాథ్‌రావు వగైరా. ...ప్రతివాది

2వ ప్రతివాదికి దావా సమన్లు

కె.సుధారాణి భర్త డి.రాఘవ్,
ఇంటి.నెం.18-97,కొత్తపేట,
కోడుమూరు గ్రామం మరియు మండలం,
కర్నూలు జిల్లా.

పై నంబరు దావాలో వాది ప్రతివాదుల పైన దావా షెడ్యూలు దాఖలా ఆస్తి యొక్క మిగతా విక్రయ మొత్తము రూ.66,25,000/-లు తీసుకొని దావాషెడ్యూలు ఆస్తిని రిజిష్టరు చేయులాగున అట్లులేని యడల వాది, ప్రతివాదులకిచ్చిన అడ్వాన్సు మొత్తము రూ.22,00,000/-లు అగ్రిమెంటు తేది నుండి అనగా 20-11-2021 తేది నుండి 18% పి.ఎ.ప్రకారం వాపసు ఇచ్చులాగున మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినాడు. ఇందులో రెండవ ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 30-10-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

షెడ్యూలు :

1వ ప్రతివాది ఎ.షెడ్యూలు ఆస్తి వివరము

కర్నూలు జిల్లా, కల్లూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా,
కల్లూరు మండలం, బస్తిపాడు గ్రామం,
సర్వే.నెం.411/బి4,యక.2-59 సెంట్లు.

2వ ప్రతివాది బి.షెడ్యూలు ఆస్తి వివరము

కర్నూలు జిల్లా, కల్లూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా,
కల్లూరు మండలం, బస్తిపాడు గ్రామం,
సర్వే.నెం.411/బి4,యక.1-70 సెంట్లు.
మొత్తం యక.4.29 సెంట్లు.
తూర్పు : వంక మరియు తెలుగు యర్రమల భూమి.
పడమర : సుధాకర్‌రెడ్డి భూమి.
ఉత్తరం : సుధాకర్‌రెడ్డి మరియు
పెద్దటేకూరు లక్ష్మమ్మ భూమి,
దక్షిణం: బి.నారాయణరెడ్డి భూమి.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

యస్.చాంద్ బాష,
వాది పరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు 7వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం.170/2023 ఇన్ ఓ.యస్.నెం.10/2023

కురువ మద్దిలేటి. ...అర్జీదారు/వాది

-Vs-

జి.గోపినాథ్‌రావు వగైరా. ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

2వ రెస్పాండెంటు / ప్రతివాదికి అర్డర్ 39 రూలు 1 మరియు 2 సి.పి.సి ప్రకారం నోటీసులు

కె.సుధారాణి భర్త డి.రాఘవ్,
ఇంటి.నెం.18-97, కొత్తపేట,
కోడుమూరు గ్రామం మరియు మండలం,
కర్నూలు జిల్లా.

పై నంబరు దావాలో వాది ప్రతివాదుల పైన దావా షెడ్యూలు దాఖలా ఆస్తి యొక్క మిగతా విక్రయ మొత్తము రూ.66,25,000/-లు తీసుకొని దావాషెడ్యూలు ఆస్తిని రిజిష్టరు చేయులాగున అట్లులేని యడల వాది, ప్రతివాదులకిచ్చిన అడ్వాన్సు మొత్తము రూ.22,00,000/-లు అగ్రిమెంటు తేది నుండి అనగా 20-11-2021 తేది నుండి 18% పి.ఎ.ప్రకారం వాపసు ఇచ్చులాగున మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేస్తూ మరియు దావా షెడ్యూలు దాఖలా ఆస్తిలో రెస్పాండెంట్లు/ప్రతివాదులు గాని వారి మనుష్యులుగానీ ప్రవేశించ కుండా మరియు ప్రతివాదులు/రెస్పాండెంట్లు ఎలాంటి అన్యాక్రాంతములు చేయకుండా దావా తీర్మానం అయ్యేంతవరకు ఇంటిరిమ్ ఇంజన్‌క్షన్ ఉత్తర్వు ఇప్పించమని కోరుతూ అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో 2వ రెస్పాండెంట్లు / ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 30-10-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

షెడ్యూలు :

1వ ప్రతివాది ఎ.షెడ్యూలు ఆస్తి వివరము

కర్నూలు జిల్లా, కల్లూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా,
కల్లూరు మండలం, బస్తిపాడు గ్రామం,
సర్వే.నెం.411/బి4,యక.2-59 సెంట్లు.

2వ ప్రతివాది బి.షెడ్యూలు ఆస్తి వివరము

కర్నూలు జిల్లా, కల్లూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా,
కల్లూరు మండలం, బస్తిపాడు గ్రామం,
సర్వే.నెం.411/బి4,యక.1-70 సెంట్లు.
మొత్తం యక.4.29 సెంట్లు.
తూర్పు : వంక మరియు తెలుగు యర్రమల భూమి.
పడమర : సుధాకర్‌రెడ్డి భూమి.
ఉత్తరం : సుధాకర్‌రెడ్డి మరియు
పెద్దటేకూరు లక్ష్మమ్మ భూమి,
దక్షిణం : బి.నారాయణరెడ్డి భూమి.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

యస్.చాంద్ బాష,
వాది పరం అడ్వకేటు, కర్నూలు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్

తగ్గిన వరి సాగు

- దిగుబడిపై ప్రభావం - ఆహార సంక్షోభానికి దారి తీసే ప్రమాదం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో రాను రాను వరి సాగు తగ్గుతోంది. ఈ ఏడాది కూడా సాధారణ సాగు కంటే తక్కువ విస్తీర్ణంలోనే సాగైంది. దీంతో దిగుబడిపై ప్రభావం చూపనుంది. దిగుబడి తీవ్రంగా తగ్గిపోతే ఆహారం సంక్షోభానికి దారి తీసే ప్రమాదం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు...

ఆరుగాలం శ్రమించి రక్తాన్ని స్వేదంగా మార్చి అన్నదాతలు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లభించక పోవడం .. దీనికి తోడు పెరిగిన కూలీ, డీజిల్, ఎరువుల ధరలు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో డబ్బు చెల్లించకపోవడంతో రైతులు వరి సాగు పట్ల మక్కువ చూపడం లేదు. ఏడాదికేడాది జిల్లాలో వరి సాగు తగ్గుతోంది. వరి సేద్యం పట్ల రైతులు అంతగా ఆసక్తి చూపకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఎరువుల ధరల పెరుగుదల, అదనుకు కావాల్సిన ఎరువులు దొరక్క పోవడం, ధాన్యానికి మెరుగైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ప్రకటించకపోవడం, పెరిగిన డీజిల్, కూలీల ధరలతో ఖర్చులు అధికం కావడంతో పెటుబడి ఖర్చులు పెరగడం వలన అన్నదాతలు వరి సాగుపై విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ ధోరణి స్థిరపడితే ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరిస్తున్నారు.

నంద్యాల జిల్లాలో ప్రధాన పంటగా ఉండే వరి సాధారణ సాగు 1,76,315 ఎకరాలు కాగా గతేడాది 1.59 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఆ సంఖ్య ఈ ఏడాదికి 1,25,950 ఎకరాలకు తగ్గింది. సాధారణ సాగులో గతేడాది 90 శాతం సాగు కాగా ఈ ఏడాది 71 శాతం మాత్రమే సాగైంది. ఎకరాకు సరాసరిన 25 బస్తాల ధాన్యం పడుతుంది. ఆ లెక్కన నంద్యాల జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాదికి 4,32,875 బస్తాల ధాన్యం దిగుబడి తగ్గింది. 2,16,437.5 క్వింటాళ్ల ధాన్యం తక్కువ పండింది. కర్నూలు జిల్లాలో వరి సాధారణ సాగు 32,272.5 ఎకరాలు కాగా గతేడాది 31,407 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఆ సంఖ్య 29,190 ఎకరాలకు తగ్గింది. సాధారణ సాగులో గతేడాది 97 శాతం సాగు కాగా ఈ ఏడాది 90 శాతం మాత్రమే సాగైంది. ఆ లెక్కన కర్నూలు జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాదికి 55,437.5 బస్తాల ధాన్యం దిగుబడి తగ్గింది. 27,718.75 క్వింటాళ్ల ధాన్యం తక్కువ పండింది. ప్రతి ఏడాది దిగుబడి తగ్గడం వల్ల ఆహార సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బియ్యం ధరలపై ప్రభావం

వరిసాగు తగ్గుదల బియ్యం ధరలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతోంది. డిమాండ్ పెరగడం సరఫరా తక్కువ అవడంతో రోజు రోజుకూ బియ్యం ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. జిల్లాలో రెండేళ్ల క్రితం కర్నూలు సోనా రకం బియ్యం 50 కిలోల బస్తా రూ.1600 నుంచి రూ.1800 మధ్య ఉండేది ప్రస్తుతం ఆ ధర రూ.3వేలకు చేరింది. గతంలో లూజు కిలో బియ్యం రూ.50కు విక్రయిస్తుండగా ప్రస్తుతం రూ.65కు విక్రయిస్తున్నారు. డిమాండ్ పెరిగితే బియ్యం ధరలు మరింత పెరిగే అవకావం ఉందని పలువురు అంటున్నారు.

రైతాంగాన్ని ఆదుకునేందుకు సమిష్టి కృషి

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగల భరత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచిం చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. మార్క్‌ఫెడ్ చైర్మన్ పి.పి.నాగి రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు వేసుకున్న పంటలను కాపాడుకుంటూ ఇంకా సాగు చేయని పొలాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సాగునీటి కాలువల పరీవాహక పొలాల్లో వరికి బదులు మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యపు పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా విదేశీ మాదకద్రవ్య కొత్త వాణిజ్య పంటలను అన్వేషించి రైతులు వేసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజును ఆదేశించారు. మిరప, పత్తి సాగు పంటలు జిల్లాలో అధిక శాతం దెబ్బ తిన్నాయని వ్యవసాయ కమిషనర్‌కు లేఖ రాయాలని జాయింట్ కలెక్టర్‌ను వారు కోరారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ క్రాప్ మిగిలిన మండలాల్లో ఇప్పటివరకు చేపట్టకపోవడానికి కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు కేటాయించిన సిసిఆర్సి కార్డుల పంపిణీ లక్ష్యాన్ని అధిగమించేందుకు వ్యవసాయ అధికారులు పెద్ద ఎత్తున కృషి చేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమయ్యే విత్తనాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఏపీ సీడ్స్, మార్క్ఫెడ్ అధికారులను సూచించారు. మండలాల వారీగా ఎఫ్‌సిఒ కింద వచ్చిన సీడ్స్‌ను కచ్చితంగా స్టాక్ రిజిష్టర్ మైంటేన్స్ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమయ్యే సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ ఏడీఏలు, గ్రామ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది పర్యటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, మార్కెటింగ్, మార్క్ఫెడ్ తదితర వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్

వినతులను గడువులోగా పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ - మండల స్థాయి స్పందనకు 117 దరఖాస్తులు

ప్రజాశక్తి - వెలుగోడు

జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన వినతులకు నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెలుగోడు మండల కేంద్రంలోని తహశీల్ధార్ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం – స్పందన కార్య క్రమం ద్వారా ప్రజల నుండి వినతులను జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య ఇతర జిల్లాధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ మాట్లాడుతూ రెవెన్యూ విభాగానికి సంబంధించి 38 శాతం పెండింగ్ కేసులు ఉన్నాయని సంబంధిత విఆర్వోలు దృష్టి పెట్టి సీరియస్‌గా తీసుకొని పరిష్కరించకపోతే కఠిన తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి ముగింపు దశకు తీసుకురావాలన్నారు. రీ సర్వే ప్రక్రియపై చాలా గ్రామాల నుండి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో విఆర్ఓలు అప్రమత్తంగా ఉండి సీరియస్ గా వ్యవహరించాలన్నారు. రీఓపెన్ అయిన కేసులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. మండల స్థాయిలో వచ్చిన 117 ప్రజా ఫిర్యాదులపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయి దృష్టి సారించి నిర్ణీత కాల వ్యవధిలో గా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత 5 నెలల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై అసంతృప్తి ఉన్నట్లు సర్వేలో వెల్లడైం దని రెవెన్యూ సిబ్బంది, అధికారులు ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిరోజు సచివాలయాల్లో 3 నుండి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం తోపాటు మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకొని సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి, మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జెడ్పిటిసి అమీరున్ బీ, ఎంపీపీ లాలం రమేష్, కోఆప్షన్ జడ్పిటిసి సయ్యద్ సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు

మునిసిపల్, నగర పంచాయతీ

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల జిల్లా మునిసిపాలిటీల, నగర పంచాయతీలలో వివిధ విభాగములలో పని చేస్తున్న ఉద్యోగులు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య, క్లాప్ డ్రైవర్స్‌లకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణంలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో నంద్యాల జిల్లా మున్సిపల్, నగర పంచాయతీ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా నాయకులు భాస్కరాచారి అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, జిల్లా కార్య దర్శి లక్ష్మణ్, మున్సిపల్, నగర పంచాయతీ కార్మికులు కొప్పెర సుబ్బ రాయుడు, రాజశేఖర్, రాజేష్, నాగరాజు, రంగడు, ఎంసి శేఖర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని హామీని అమలు చేయకుండా ఆప్కాస్‌లో కలపడం దుర్మార్గం అన్నారు. ఆప్కాస్ వద్దు పర్మినెంట్ కావాలని మున్సిపాలిటీ నగర పంచాయతీ కార్మికులు గత నాలుగు సంవత్సరాలుగా అనేక రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. కార్మికులకు కనీస వేతనంతోపాటు పిఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్లో ఉన్న వేతన బకాయిల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా రాబోయే మూడు నెలల కాలంలో అన్ని మున్సిపాలిటీ, నగర పంచాయతీ కార్మికులను ఐక్యం చేసేలా పోరాటం నిర్వహిస్తామని, అప్పటికీ కళ్ళు తెరవకపోతే ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు మున్సిపల్ కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

త్యాగానికి ప్రతీక

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పోలీసు విధి నిర్వహణ అత్యంత శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగుల్లా కొన్ని గంటలకు పరిమితమైనది కాదు. ఎండా.. వాన, పగలూ.. రాత్రి అనే తేడా లేకుండా విధులు నిర్వహిస్తుంటారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం. సంపన్నుడు మొదలు.. సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతి అవసరానికీ సాయం కోరేది పోలీసులనే. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడేవారు సైనిక జవానులైతే.. అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు. సంఘ విద్రోహ శక్తులతో పోరాడి విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకునేందుకు శనివారం జిల్లాలో పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం ప్రతి సంవత్సరం అక్టోబరు 21న జరుపుకుంటారు. భారత్–చైనా సరిహద్దుల్లోని ఆక్సయ్ చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తున రక్తం గడ్డకట్టే మంచు పర్వతాల మధ్యన ఉన్న వేడి నీటిబుగ్గ (హాట్ స్ప్రింగ్స్) అమర జవానుల త్యాగాలకు ప్రతీకగా మన మధ్య నిలిచి ఉంది. దేశవ్యాప్తంగా విధినిర్వహణలో అసువులుబాసిన పోలీసులను స్మరిస్తూ, ప్రతి ఏడాది అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించడం ఈ పవిత్ర స్థలం నుంచే ఆరంభమైంది. మిలటరీ ఎత్తుగడలకు చైనా సరిహద్దులోని భారత భూభాలైన లడఖ్, సియాచిన్ ప్రాంతాలు కీలకమైనవి. సరిహద్దు భద్రతాదళం, ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ వంటి ప్రత్యేక భద్రతాదళాలు ఏర్పడక ముందు సరిహద్దులను రక్షించే బాధ్యతను కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్స్ బలగాలు నిర్వర్తించేవి. 1959 అక్టోబరు 21న డీఎస్పీ కరమ్ సింగ్ నేతత్వంలో పంజాబ్‌కు చెందిన 21 మంది సభ్యుల బృందం సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తుండగా, చైనా రక్షణ బలగాలు సియాచెన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్పీఎఫ్ దళం హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో దీటుగా ఎదురొడ్డి పోరాడింది. ఆ పోరాటంలో పది మంది భారత జవాన్లు ప్రాణాలను కోల్పోయారు. హాట్ స్ప్రింగ్స్ అంటే వేడి నీటిబుగ్గ అని అర్థం. కానీ భారత జవాన్ల రక్తంతో తడిచిన హాట్ స్ప్రింగ్స్ నెత్తుటి బుగ్గగా మారి పవిత్రస్థలంగా రూపు దిద్దుకుంది. ప్రతి ఏడాదీ అన్ని రాష్ట్రాల పోలీసులతో కూడిన బృందం ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి నివాళులు అర్పించడం ఆనవాయితీ. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోనూ శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోలీస్ అమరవీరుల స్థూపాలకు నివాళులు అర్పించనున్నారు.

హంస వాహనంపై స్వామి అమ్మవార్లు ఊరేగిస్తున్న దృశ్యం

కాత్యాయినిగా అమ్మవారు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో భ్రమరాంబికా అమ్మవారు కాత్యాయినీ అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమి చ్చారు. హంస వాహనంపై స్వామి అమ్మవార్లు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మహోత్సవాలలో భాగంగా ఆరవ రోజున అమ్మవారికి కాత్యాయిని అలంకారంలో అలంకరించి, హంస వాహనంపై స్వామి అమ్మవార్లను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం నుండి రాత్రి వరకు అమ్మవారికి శ్రీచక్రార్చన, నవావరణార్చన, విశేష కుంకుమార్చనలు, రుద్రహోమం, చండీహోమం కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఆస్థాన సేవ,సువాసిని పూజలు నిర్వహించారు.

కుమారి పూజ : దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి కుమారి పూజ ప్రత్యేకంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ పూజల్లో 2- 10 మధ్య వయసు కలిగిన బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రములు, సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమం దసరా నవరాత్రి ఉత్సవాల్లో ముఖ్యమైనదిగా సంప్రదాయంలో ఆనాయితీగా వస్తుంది.

గ్రామోత్సవం : దసరా మహోత్స వాలలో భాగంగా నవదుర్గ అలంకారంలో ఒకటైన కాత్యాయిని అలంకా రంలో ఉన్న అమ్మవారిని హంస వాహనంపై ఉన్న స్వామి అమ్మవార్లను వివిధ రకాల కళా నృత్య ప్రదర్శనలతో ఆలయ రాజగోపురం గుండా ప్రధాన వీధుల్లోకి ప్రవేశింప చేసి రథసాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథసాల వద్ద నుండి నంది గుడి వరకు నంది గుడి వద్ద నుండి బయలు వీరభద్ర స్వామి వరకు గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో నృత్య ప్రదర్శన, కోలాటం, చెక్కభజన, తప్పెటచిందు వంటి వివిధ రకాల కళా నృత్య ప్రదర్శనల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని కొండపేట శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శరన్నవరాత్రుల్లో సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాదంశెట్టి వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ శ్రీరామసుబ్రహ్మణ్యం, ట్రెజరర్ సముద్రాల చక్రపాణి, గౌరవ సలహాదారులు గాదంశెట్టి రవికుమార్, ఉపాధ్యక్షులు నల్లగట్ల శివయ్య, సెక్రటరీ గూండా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒపిఎస్ వచ్చే వరకు పోరాటం

- నిరవదిక దీక్షల్లో యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-డోన్

ఒపిఎస్‌ను అమలు చేసే వరకు పోరాటం ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకట సుబ్బారెడ్డి అన్నారు. డోన్ యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్షలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకటసుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు జీవితంలో వృద్ధాప్యంలో భరోసా లేకుండా పోయిందన్నారు. సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేయాలని, ఓపిస్‌ను అమలు చేయాలని కోరారు. అనంతరం ఎస్టియు ఉపాధ్యాయ సంఘం నుండి రమణ, ఇక్బాల్ లు,పెన్షనర్ల సంఘం నాయకులు , సీఐటీయూ నాయకులు,తెలుగు దేశం పార్టీ నాయకులు ధర్మవరం సుబ్బారెడ్డి,నబీసాహెబ్ లు , విఒఏ సంఘం నుండి గుండాలయ్య,లక్మణ్ లు సంఘీభావం తెలిపారు. నిరవధిక దీక్షలకు సుమన్, సురేష్,మద్దయ్య,రమేష్ నాయుడు,క్రిష్ణానాయక్, మధు, చంద్ర శేఖర్ గౌడ్,లక్ష్మయ్యలు దీక్షలలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, సీనియర్ నాయకులు బివై సుబ్బారాయుడు, శంకరయ్య గౌడ్, కేశవరెడ్డి,లక్ష్మీ కాంత రెడ్డి, భాస్కర్ రెడ్డి, రఘునాథ్, బొజ్జన్న,రమేష్, ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు. **రెండవ రోజు.. నంద్యాల :** పాత పెన్షన్ అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి రెండవ రోజుకు చేరాయి. రెండవ రోజు నిరసన దీక్షలను జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి.ప్రసాద్, జె.సుధాకర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్‌కు ప్రత్యామ్నాయం ఏది లేదని, జిపిఎస్‌తో ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుంచి కాంట్రిబ్యూషన్ కట్టించుకుంటారని అటువంటప్పుడు అది ఆదర్శవంతమైన పెన్షన్ విధానం ఎలా అవుతుందని అన్నారు. పంజాబ్, రాజస్థాన్, ఛత్తీస్‌గడ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు ఓపిస్ అమలు దిశగా వెళ తున్నాయని, కేరళ, తమిళ నాడు,కర్ణాటక రాష్ట్రాలలో పాత పెన్షన్ అమలు చేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. 2019లో ఎన్నికల సందర్భంగా పాత పెన్షన్ అమలు చేస్తానని హామీ ఇచ్చి, ఓట్లు వేయించుకొని లబ్దిపొంది, తీరా అధికారంలోకి వచ్చాక మడమ తిప్పడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పాత పెన్షన్ అమలు చేస్తామని ఎవరు ముందుకు వస్తే వారినే ఆదరిస్తామని, ఓట్ ఫర్ ఓపీస్ నినాదం కింది వరకు తీసుకుపోతామని అన్నారు. రాజకీయ పార్టీలు పాత పెన్షన్ అమలు పైన హామీ ఇచ్చే వరకు ఈ పోరాటం ఆగదని, దశల వారీగా మండల స్థాయి వరకు తీసుకు పోతామని అన్నారు. ఈ నిరవదిక దీక్షా కార్యక్రమంలో రామకృష్ణుడు, వేంకటేశ్వర రెడ్డి, అరవింద్, రామకృష్ణా రెడ్డి, ఖాసిం, మహనంది శేఖర్, రుద్రవరం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకటసుబ్బారెడ్డి

నంద్యాల : నిరవదిక దీక్షలు చేస్తున్న యుటిఎఫ్ నేతలు

రాష్ట్ర సాయి ధర్నాకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

రాష్ట్ర స్థాయి ధర్నాను విజయవంతం చేయండి

- ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి. హృదయరాజు

ప్రజాశక్తి - నంద్యాల

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ బకాయిలను చెల్లించాలని, జీవో నెంబర్ 117 రద్దు చేయాలని తదితర డిమాండ్లతో ఈనెల 29వ తేదీన విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు జి. హృదయ రాజు, రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు బి. మాధవస్వామి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత జీపీఎస్‌ను ప్రవేశపెట్టడం దుర్మార్గం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఒపిఎస్ తప్ప జిపిఎస్‌ను అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం 2004 కంటే ముందు నోటిఫికేషన్ వల్ల ఉద్యోగం పొంది అనంతరం నియామకమైనఉపాధ్యాయ, ఉద్యోగులకు వెంటనే ఒపిఎస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని వారు కోరారు. నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మదస్వామి, కె. సాంబశివుడు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల నుండి మూడు నాలుగు ఐదు తరగతులను ఉన్నత పాఠశాలలకు తరలించిన జీవో నెంబర్ 117ను ఉపసంహరించుకోవాలన్నారు. కారుణ్య నియామకాలను తక్షణమే చేపట్టాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేసి బదిలీలు పదోన్నతులు కల్పించాలని, మోడల్ స్కూల్, కేజీబీవీ, గురుకుల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు ఎం. స్వామినాథం, ఎం. వెంకటరాముడు, మల్లెల పుల్లయ్య, ఆవుల మునిస్వామి, రాష్ట్ర కౌన్సిలర్లు బత్తుల రవికుమార్, గోపాల్ రావు, జిల్లా నాయకులు మానపాటి రవి, నగిరి వెంకటేశ్వర్లు, కె. రాముడు మద్దిలేటి ,రమణ యాదవ్, ప్రతాపరెడ్డి, నాగశేషులు, రాం ప్రసాద్, ఆంజనేయులు, విజయకుమార్, ఖలీల్, బాల వెంకటేశ్వర్లు, కాసిం, శ్రీనివాసులు, చంద్రశేఖర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పట్టాలకు స్థలాలు చూపకపోతే ఆందోళన ఉధృతం : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూర్ మండలంలోని బిజినవేముల గ్రామంలో జగనన్న కాలనీలో 154 మందికి పట్టాలు పంపిణీ చేసి, 25 మందికి స్థలాలు చూపలేదని తక్షణమే వారికి స్థలాలు చూపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు లబ్ధిదారు లతో ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమా నికి సిపిఎం నాయకులు పి పకీర్ సాహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు మాట్లా డుతూ జగనన్న కాలనీలో రెండు సంవత్సరాలు కావస్తున్న స్థలాలు ఇంతవరకు చూపలేదన్నారు. జగనన్న కాలనీలో ఇల్లు పూర్తి చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పుతుంటే ఇచ్చిన పట్టాలకు స్థలాలు చూపించాలని అధికారులకు మొరపెట్టుకున్న స్థలాలు చూపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గత రెండు సంవత్సరాల నుండి స్థలాలు చూపాలని అనేక రూపాల్లో ఆందోళన చేస్తున్న అధికారులు నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సామూహిక గృహప్రవేశాలు ఆర్భాటంగా ఈనెల 12న గృహప్రవేశాలు చేసినప్పటికీ బిజినవేముల గ్రామంలో లబ్ధిదారులకు స్థలాలు చూపకపోవడం విచారకరం అన్నారు. తక్షణమే పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపించి పక్క గృహాలు మంజూరు చేయాలని కోరారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ సమావేశంలో ఎంపీపీ మురళీమోహన్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ సోమేశ్వరమ్మలకు వినతిపత్రం ఇచ్చారు. వారం లోపు స్థలాలు చూపించి గృహాలు మంజూరు చేస్తామని ఎంపిపి, డిప్యూటి తహశీల్దార్‌లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సి నాగన్న, డికుమార్, సతీష్, శ్రీనివాసులు, మహేష్, మాదన్న, అన్వర్ బాష, నాగేష్, అంజనమ్మ, పార్వతమ్మ, గాయత్రి, నాగమ్మ, రామసీతమ్మ తదితరులు పాల్గొన్నారు .

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

29న దూదేకుల సింహగర్జన

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఈనెల 29వ తేదీన గుంటూరులో జరగబోతున్న దూదేకుల సింహగర్జనను జయప్రదం చేయాలని నంద్యాల జిల్లా దూదేకుల వర్కింగ్ ప్రెసిడెంట్ దూదేకుల క్రాంతి కోరారు. బేతంచర్ల పట్టణం శ్రీనగర్ కాలనీలో గల షాదీఖానాలో ఏర్పాటు చేసిన ముస్లిం దూదేకుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం శుక్రవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాయకులు క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దూదేకులను గాలికి వదిలేసిందన్నారు. దూదేకులకు వారికి దమాషా ప్రకారం రాజకీయ సీట్లు ఇవ్వాలని అన్నారు. అక్టోబర్ 29వ తేదీన గుంటూరులో జరిగే దూదేకుల సింహగర్జనకు దూదేకుల సోదరులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేతంచర్ల దూదేకుల కమిటీ సభ్యులు దస్తగిరి, మహబూబ్ బాషా, కమల్, అమ్మని పెద్దయ్య,పి. భాష, సుల్తాన్, ఐస్ కమాల్, పి.కమల్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

కిడ్నాప్ కేసులో మరో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

బేతంచెర్లకు చెందిన సిహెచ్ వినాయక రెడ్డి, సిహెచ్ భరత్ కుమార్ రెడ్డి, డ్రైవర్ సాయినాథ్ రెడ్డిల కిడ్నాప్ కేసులో మిగిలిన కీలక నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కిడ్నాప్ కేసుకు సంబంధించిన పలు విషయాలను జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి వెల్లడించారు. కిడ్నాప్‌కు గురైన సిహెచ్ వినాయక రెడ్డి తండ్రి సిహెచ్ నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తును ప్రారంభిం చారు. ఆ మేరకు ఈ ఏడాది జూన్ 30వ తేదీన కిడ్నాప్ ముఠాలోని 12 మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి నుండి రూ.40 లక్షల నగదును, నేరము చేయు క్రమములో ఉపయోగించిన నాలుగు కార్లను, మూడు సెల్ ఫోన్‌లను, ఒక కత్తిని అప్పట్లో స్వాధీనము చేసుకున్నారు. అందులో కొంత మంది ముద్దాయిలు దొరకకుండా తప్పించుకొని తిరుగుతున్న ఏ -1 గోగుల నరేష్‌ను అరెస్టు చేసి అతడి నుండి రూ.92,56,000, ఇదివరకు అరెస్ట్ అయిన ఏ-3 వాటా రూ.75 లక్షలు, సత్యసాయి జిల్లా పరిగి మండలము పెద్దిరేద్దిపల్లి గ్రామానికి చెందిన ఏ -2గా ఉన్న చెన్నా భాస్కర్‌ను అరెస్టు చేసి రూ. 95,04,200, కర్ణాటక రాష్ట్రం చిక్బల్లాపూర్ జిల్లా బాగేపల్లి తాలూకా ఎస్సి కాలనీ పుట్టపర్తికి చెందిన ఏ -4 పుట్టపర్తి రఘుఏ కదిరప్ప రఘును అరెస్టు చేసి రూ.3,53,800, మొత్తం రూ.2 కోట్ల 66 లక్షల 14,000 స్వాధీన పరుచుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈకేసులో ఇప్పటివరకు బాధితులు కిడ్నాపర్స్‌కు ఇచ్చిన రూ.4 కోట్లలో మొత్తం రూ. 3 కోట్ల 6 లక్షల 14,000 స్వాదీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ముద్దాయిలను శుక్రవారం అనంతపురం జిల్లా గుత్తి మండలం, గుత్తి టౌన్‌కు ఊరి బయటగల టోల్ గేటుకు సుమారు అర్ధ కిలోమీటర్ దూరంలో బెంగళూరు నుండి హైదరాబాద్ పోయేఎన్ హెచ్ -44 హైవే పక్కన గల మూతబడిన పెట్రోల్‌బంకు వద్ద అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

నాటు తుపాకి స్వాధీనం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని అహోబిలంలో ఈనెల 15న మోకుల పెద్దన్న అనే వ్యక్తి అడవికి వెళ్లగా నాటు తుపాకితో కాల్చి గాయపరిచిన కేసులో కాకి ఆంజనేయులు అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ సిఐ హనుమంతు నాయక్ తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 15న మోకుల పెద్దన్న అనే వ్యక్తి చిన్నాన్న కొడుకు మోకుల నరసింహతో కలిసి తేనె కోసం అహోబిలం అటవీ ప్రాంతానికి వెళ్లాగా..కాకి రామాంజనేయులు అనే వ్యక్తి వారిని వెంబడించి నరసింహను తుపాకితో కాల్చగా అది గురి తప్పి పెద్దన్నకు తగిలిందన్నారు. పెద్దన్న ఇచ్చిన ఫిర్యాదుతో డిఎస్పి వెంకటరామయ్య పర్యవేక్షణలో తమ సిబ్బంది ప్రత్యేక దర్యాప్తు చేపట్టా రన్నారు. దర్యాప్తులో భాగంగా శుక్రవారం పెద్ద కందుకూరు మెట్ట వద్ద రామాంజనేయులును అరెస్టు చేసి కాశిరెడ్డి నాయన ఆశ్రమం సమీపంలోని అడవి ప్రాంతంలో దాచిపెట్టిన నాటు తుపాకీని, ఐదు సీసపు గుళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నరసింహ తన భార్యతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడన్న అనుమానంతో తుపాకితో కాల్చాడని ఫిర్యాదు దారుడు పెద్దన్న తెలిపారన్నారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై నరసింహులు, సిబ్బంది సురేష్ రెడ్డి, నాగరాజు, ప్రతాప్, రాధాకృష్ణ ఉన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

వృద్ధులతో ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి

ప్రజాశక్తి - విలేకరులు

బేతంచెర్ల : జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలందరికీ ఇంటి వద్దకే మెరుగైన వైద్యం అందుతోందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైయస్ఆర్పీ సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి అన్నారు. శుక్రవారం జగనన్న సురక్ష ఆరోగ్య కార్యక్రమం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గ్రామ సర్పంచ్ గుమ్మగాళ్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుగ్గన మాట్లాడారు. ఆరోగ్య శిబిరంలో వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్ రంగానాయక్, మాజీ సర్పంచి మోహన్ రెడ్డి, బీరెల్లి నాగేశ్వర్ రెడ్డి, గూని నాగరాజు, మండల కన్వీనర్ కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ, మహబూబ్ బాషా ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్లు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని సర్పంచ్ తులసమ్మ అన్నారు. శుక్రవారం చాగలమర్రి పట్టణంలోని 5వ సచివాలయ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో వారు ప్రారంభించారు. తహసీల్దారు సుభద్రమ్మ, ఎంఎడీవో మహబూబ్ దౌలా, ఈఓఆర్డి సుదర్శన్ రావుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో పిఆర్ ఏఈ కొండారెడ్డి,సిఎచ్ఓ రమణమ్మ,హెల్త్ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి,ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ,వైద్య,ఆరోగ్య,సచివాలయసిబ్బంది,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** మండలంలోని సుండిపెంటలో తాసిల్దార్ రాజేంద్ర సింగ్, సచివాలయం కన్వీనర్ ఆటో మల్లి, ప్రభాకర్, పంచాయతి, కార్యదర్శి బాలు నాయక్, స్థానిక వైసిపి నాయకులు వట్టి వెంకటరెడ్డి, భరత రెడ్డి, ఎం.ఏ. రజాక్,ప్రవీణ్ తేజ, గుండయ్య యాదవ్ పర్యవేక్షణలో వెస్ట్రేన్ కాలనీ 3వ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మూడవ విడత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో వైద్యులు రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేసి గర్భవతులకు, బాలింతలకు పౌష్టిక ఆహారం పంపిణీ చేశారు. **నందికొట్కూరు టౌన్ :** జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామంలో హైస్కూల్ నందు జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సర్పంచి మాధవరం ప్రకాశం హాజరైయ్యారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీపీ, ఎంపీటీసీ, ఈడుల నారాయణరెడ్డి, శివారెడ్డి, వ్యాకస నాయకులు ఎం కర్ణ, రైతు సంఘం నాయకులు టీ రసూల్ దుబాయ్ ఎం రంగస్వామి బాబు, పాణ్యం రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు టౌన్: మాట్లాడుతున్న మాధవరం ప్రకాశం

బనగానపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం లాంటిదని ఎంపీడీవో శివరామయ్య పేర్కొన్నారు. మండలంలోని పాతపాడు గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ఈఓ నల్లగట్ల వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు గడ్డం వెంకటేశ్వర రెడ్డి, ఒంటెద్దు చిన్నపురెడ్డి, కాతాల తిరుపాల్, పాతపాడు క్రిష్ణగిరి గ్రామపంచాయతీ కార్యదర్శులు శకుంతల, వేదవతి సిబ్బంది పాల్గొన్నారు. **ఆత్మకూరు:** అమలాపురం గూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. బైర్లూటి వైద్యాధికారులు డా.గోపాల్, డా. పవన్ కుమార్ చెంచులందరికి రక్తపోటు, మధుమేహ, రక్త శాతం మొదలైన పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఖుద్ బాషా , సూపర్ వైజర్ రవణమ్మ, స్టాఫ్ నర్స్ షఫీ మున్నిసా, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : బుడ్డా

ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం అని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాబు భవిష్యత్తు గ్యారంటీ బాబుతో నేను ప్రచారంలో భాగంగా శ్రీశైలం మండలం లింగాలగట్టులో శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం లింగాల గట్టులో ప్రజావేదికను ఏర్పాటు చేసి మాట్లాడారు. ముందుగా సుండి పెంట రెడ్ల కళ్యాణ మండపం నందు సీనియర్ పాత్రికేయుని కుమారుని వాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే సున్నిపెంట కాలనీలో 14వ భూత నందు భవిష్యత్తుకు గ్యారంటీ బాబుతో నేను ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈయన వెంట స్థానిక టిడిపి నాయకులు వీపీఏ బెంజిమెన్, ఏ. సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి,ఉమామహేశ్వరరావు, రమణ, జంకె రామ సుబ్బారెడ్డి ఉన్నారు.

బండి ఆత్మకూర్ : టిడిపి మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన మహిళా శక్తి ద్వారా రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తుందని శ్రీశైలం నియోజకవర్గం మహిళా శక్తి కన్వీనర్ గంగాదేవి ఆశాభావం వ్యక్తం చేశారు. సంత జుటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మహాశక్తి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తీసుకురావాలని మహిళలంతా ఏకతాటిపై నిలబడి కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మహానంది ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సురేష్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ తెలుగు యువత నాయకులు మల్లేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు మహేశ్వర్ రెడ్డి, జాకీర్ ఖాన్, చాంద్ బాషా, తిరుపాల్, రమేష్, టిడిపి మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : టిడిపి నాయకులు అంకిరెడ్డిపల్లి గ్రామంలోప్రజా వేదిక నిర్వహించి అనంతరం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల ప్రచార కార్యదర్శి ఎంవి శివరామిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమం పుల్లారెడ్డి శివరామిరెడ్డి ప్రతాపురెడ్డి, రామాంజనేయులురెడ్డి,బుజ్జి పాల్గొన్నారు.

పీర్ల చావిడికి వేల్పుల ఆనంద్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం వాడాల గ్రామంలో పీర్ల చావిడి నిర్మా ణానికి కష్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్ ఆర్థిక సాయాన్ని అందించారు. శుక్రవారం ఆయన పాములపాడులో పీర్ల చావిడి నిర్మాణానికి రూ.20 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వేల్పుల ఆనంద్ మాట్లాడుతూ గ్రామస్తులు కుల, మతాలకు అతీతంగా పీర్ల పండుగను జరుపుకుంటూ ఉంటారని, తన వంతు సహకారంగా ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలకు తన వంతు సాయం అందజేస్తుంటానని పేర్కొన్నారు. వేల్పుల ఆనంద్ సాయం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గట్టు శంకర్ గౌడ్, ఎల్ల గౌడ్, సంజీవ రాయుడు, అంకన్న, రుద్రవరం శంకర్ గౌడ్, వినోద్, నరేంద్ర, మహి మహానంది రెడ్డి, నరసింహ, చంద్ర, మాజీ సర్పంచ్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న కష్టమ్స్ వేల్పుల ఆనంద్

జిల్లా కెడిసిసి చైర్మన్‌ను కలిసిన నాగంపల్లి సొసైటీ చైర్మన్, జడ్పిటిసి

నాగంపల్లి సొసైటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- జిల్లా కెడిసిసి చైర్మన్‌ను కలిసిన నాగంపల్లి సొసైటీ చైర్మన్, జడ్పిటిసి

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండల కేంద్రంలో ఉన్న నాగంపల్లి సొసైటీ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ఉమ్మడి కర్నూలు జిల్లా కెడిసిసి చైర్మన్‌ను కొత్తపల్లి నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డిలు కోరారు. శుక్రవారం కర్నూలులో మాజీ ఎమ్మెల్యే ఎస్.వి. మోహన్ రెడ్డి, జిల్లా కెడిసిసి చైర్మన్ విజయ మనోహరిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డిలు మాట్లాడుతూ కొత్తపల్లిలోని నాగంపల్లి సోసైటీ కార్యాలయం అభివృద్ధి కోసం మార్టగేజ్ లోన్లు, క్రాప్ లోన్లు మండల రైతులకు అందించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. నిధులు కేటాయిస్తే రైతుల అభివృద్ధికి సాధ్యం అవుతుందన్నారు. అదేవిధంగా కార్యాలయానికి ప్రహరీ గోడలేక ఇబ్బందులు పడుతున్నామని దాని నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరారు. మండలంలో గత ప్రభుత్వ హయాంలో నకిలీ పాసుపుస్తకాలు పుట్టించి కొంతమంది దళారులు రైతులపేరుతో ప్రభుత్వ సొమ్మును కాజేసి నేటికి చెల్లించలేదని, వాటిపై విచారణ జరిపించి రికవరి చేయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆమె తప్పకుండా కొత్తపల్లిలోని నాగంపల్లి సింగిల్ విండ్ సొసైటీ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వీరివెంట వైఎస్సార్సీపీ నాయకులు నారాయణరెడ్డి, రహంతుల్లా ఉన్నారు.

గోస్పాడులో యూరియా కొరత

- ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. మార్క్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గోస్పాడు మండలంలో గత పది రోజుల నుంచి యూరియా కొరత ప్రధానంగా కనిపిస్తోందని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. మార్క్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ డీలర్లు పక్కన గోడౌన్లలో పెట్టుకొని యూరియా లేదని కొరత సృష్టిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బస్తా యూరియా రూ.330 నుంచి రూ.350 వరకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. అలాగే 20.20.0.13, డిఎపి, పొటాష్ లాంటి బస్తాలనూ ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా రెట్టింపుగా అమ్ముతూ నిలువున రైతులను మోసం చేస్తూన్నారని, డీలర్లపైన కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మాజీ చీఫ్ సెక్రెటరీని ఆశీర్వాదిస్తున్న అర్చకులు

అహోబిలేసుని సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీ నరసింహస్వామిని ఎపి మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ టూరిజం చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణమూర్తి, సూపర్డెంట్ ఇంజనీర్ మల్ రెడ్డిలు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయం వద్దకు వారు చేరుకోగానే ఆలయ అర్చకులు, మఠం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువుదిరిన ప్రహ్లాద వరద స్వామి, అమృతవల్లి అమ్మవార్లను దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణ ంలో అర్చకులు వారిని వేద మంత్రలతో ఆశీర్వది ంచి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అహోబిలంలో నిర్మిస్తున్న టూరిజం బిల్డింగ్ ని పరిశీలించి పలు సూచనలు చేశారు. వీరి వెంట ఈఈ ఈశ్వరయ్య, అహోబిలం టూరిజం సిబ్బంది కిరణ్ కుమార్ రెడ్డి, గోపాల్ తదితరులు ఉన్నారు.

ప్యాపిలిని కరువు మండలంగా


మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావు యాదవ్

ప్రకటించాలి : టిడిపి

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్యాపిలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వై నాగేశ్వరరావు యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో రైతులు పంటలు పండక తీవ్ర నష్ట పోయారని, రైతులకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ముఖ్యమంత్రి కర్నూలు జిల్లా పర్యటన అట్టర్‌ఫ్లాప్ అయిందని విమర్శించారు. చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేసి సిఎం జగన్ రాష్ట్రంలో ప్రశాంతంగా తిరగటానికి సైతం భయపడుతున్నాడని అన్నారు. ప్యాపిలి పట్టణంలో టిడిపి కార్యకర్తలపై గంజాయి కేసులు, అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం దారుణమన్నారు. వెంటనే వారిపై ఉన్న కేసులను ఎత్తి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్ యాదవ్,

క్రిష్ణగిరి మెట్ట నుంచి అలియాబాద్ తండా వరకు బిటి రోడ్డు

- ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె

క్రిష్ణగిరి మెట్ట నుంచి అలియాబాద్ తాండా వరకు బీటీ రోడ్డును వేయనున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. త్వరలో వేయనున్న టెండర్ల ప్రక్రియలో భాగంగా మండలంలోని క్రిష్ణగిరి మెట్ట నుండి మంగంపేట తండా వరకు రోడ్డును ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆర్‌అండ్‌బి ఇఎన్‌సి నయముల్ల, ఎస్.ఇ. నాగరాజుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని క్రిష్ణగిరి మెట్ట నుంచి అలియాబాద్ తాండా వరకు రూ.22 కోట్ల 50 లక్షలతో బీటీ రోడ్డును వేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, త్వరలో వేయనున్న టెండర్లలో వున్న పనులు వాటి పరిశీలన నిమిత్తం రోడ్లు, భవనంల శాఖ చీఫ్ ఇంజనీర్ నయాముల్ల అధికారులతో కలిసి పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమంకు నిత్యం భక్తులు వందలాదిమందిగా వచ్చి వెళ్తుంటారని భక్తులకు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని రోడ్డు సమస్య త్వరలోనే తీరిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ సి నాగరాజు, డిఈ సునీల్ రెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఆర్ అండ్ బి ఏ ఈ హుస్సేనీ, శ్యాంసుందర్, వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని ఆర్ అండ్ బి ఈ ఎన్ సి నయముల్లా

కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో పూజలు

అవుకు మండలం కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆర్ అండ్ బి ఈ ఎన్ సి నయముల్లాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఆవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి , ఆర్ అండ్ బి ఎస్ ఈ నాగరాజు, డిఈ సునీల్ రెడ్డి, ఏఈ ఉసేని, శ్యాంసుందర్ వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డిలుపాల్గొన్నారు.

చెత్త ప్రాసెసింగ్‌తో పర్యావరణ పరిరక్షణ : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

స్వచ్ఛభారత్ ప్రోగ్రాంలో భాగంగా పర్యావరణాన్ని కాపాడేందుకు రూపొందించిన చెత్తప్రాసెసింగ్ యూనిట్ పనులను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ శుక్రవారం ప్రారంభించారు. సప్తశైల రాజేష్ మాట్లాడుతూ ప్రతి మున్సిపాలిటీలో కంపోస్ట్ యార్డులో ఎప్పటినుండో పేరుకుపోయిన చెత్త వలన ఏర్పడు వ్యర్థాలతో భూగర్భ జలాలు, భూమి ఉపరితలం కాలుష్యం ఏర్పడుతుందన్నారు. పట్టణాలలో రోజువారి జనాభా పెరిగిపోయి పట్టణంలో సేకరించిన చెత్తను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెసింగ్ చేయుటకు సరైన స్థలం లేనందున స్వచ్ఛభారత్ మిషన్ 2 లో భాగంగా డోన్ పురపాలక సంఘానికి చెందిన కంపోస్ట్ యార్డ్‌లో ఉన్న దాదాపు 80 వేల టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేయుటకు రూ.ఐదు కోట్ల వ్యయంతో ఆరు నెలల కాలవ్యవధిలో పనులను పూర్తి చేయనునఆనమన్నారు. స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ వారు టెండర్లను పిలిచి టెండర్ ప్రక్రియలో ఎంపికైన జ్ఞానేశ్వర్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారిని డోన్ పట్టణంలో లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ చేయుటకు ఆదేశాలు జారీ చేశారన్నారు. జ్ఞానేశ్వర్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఈ పనులను చేస్తారని చెప్పారు. ఈ పనులతో పర్యావరణాన్ని కాపాడుటకు తోడ్పడుతుందని చైర్మన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డిఇ రసూల్, ఎఇ సురేష్ , సానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభించిన సప్తశైల రాజేష్

సరస్వతి దేవి అలంకారంలో అమ్మవారు

ప్రజాశక్తి - డోన్ : దసరా నవరాత్రులలో భాగంగా ఆరవ రోజు డోన్ పట్టణంలోని అమ్మవారి శాలలో సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శన మిచ్చారు. కుంకుమార్చన,అభిషేకం,మంగళ హారతి, పల్లకిసేవ, హెూమా లు అమ్మవారి సన్నిధిలో నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్రికె హరికిషన్,సెక్రటరీ పీవీ.రంగయ్య, కోశాధికారి చాటకొండ వెంకటేశ్వర్లు తెలిపారు.అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. **బనగానపల్లె :** మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దివ్య మంగళ అలంకరణ లో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరోవ రోజు చౌడేశ్వరి దేవి దేవస్థానంలో అమ్మవారు దివ్య మంగళ అలంకరణలో పూజలు అందుకున్నారు. ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డోన్ : సరస్వతిదేవి అలంకారంలో అమ్మవారు

టిడిపికి పూర్వ వైభవం తీసుకొస్తా : మాండ్ర

- శివపురంలో వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

టిడిపికి పూర్వ వైభవం తీసుకరావడం జరుగుతోందని, టిడిపితోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ నారపు రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నుంచి టిడిపిలోకి వస్తున్న పలువురు గ్రామస్తులకు మాండ్ర శివానందరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ టిడిపికి పూర్వ వైభవం తీసుకురావడం జరుగుతుం దన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాలను టిడిపి హాయంలోనే అభివృద్ధి జరిగింది తప్ప వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు అవుతున్న అభివృద్ధి శూన్యం అన్నారు. టిడిపి ప్రభుత్వంలో కొత్తపల్లి మండలానికి కృష్ణ పుష్కరాల సమయంలో కోట్లాది రూపాయలు మంజూరు చేసి రోడ్లు వేసిన ఘనత టిడిపిదే అన్నారు. ప్రస్తుత అధికార పార్టీ ఏ ఒక్క రోడ్డు కూడా వేయలదేని, ఉన్న గుంతలను పూడ్చిన దాఖలు లేవన్నారు. రైతులు, బడుగు, బలహీన వర్గాలు మహిళల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం అన్నారు. టిడిపి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం బాబుతో నేను పోస్టర్లను విడుదల చేసి, నేనుసైతం-బాబుకోసం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తదనంతరం గ్రామంలో నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో మండల నాయకుల ఆధ్వర్యంలో కైపా అంబయ్య, కె. రామసుబ్బయ్య, చంద్రగౌడు, సుబ్బయ్య గౌడు, నాగార్జునగౌడు, ధనుంజయగౌడు, చంద్రుడు, బోయ నాగన్న, బోయ నరసింహులు, లింగుస్వామి, కైపా మహేష్, కృష్ణుడు, పవన్, హుసేనయ్య, నాగేశ్వరరావు, కదిరి రాజేష్, ప్రేమ్, చెంచు నిరంజన్, చెంచు శ్రీను, మల్లయ్య, కురుమయ్య, బైరెడ్డి తదితరులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారపురెడ్డి, మాజీ కన్వీనర్లు జడ్ వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి మండల నాయకులు లింగస్వామిగౌడ్, బుచ్చిరెడ్డి, జయసూర్య, శివారెడ్డి, రహీం, మల్లి, రాజు, సుధాకర్, శేఖర్, మారెన్న, నాగేశ్వరరావు, బాషా, నారాయణ, దర్గయ్య, లింగన్న, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, వెంకటే శ్వర్లు యాదవ్, నాగముని, కాంతారెడ్డి, మహేశ్వరరెడ్డి, ముర్తుజావాలి, జమీల్, రసూల్ పాల్గొన్నారు.

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాండ్ర శివానందరెడ్డి

సమస్యలను అధికారుల దృష్టికి తేవాలి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

సమస్యలు అధికారుల దృష్టికి తేవాలని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన ఎంపీడీవో సుగుణ శ్రీ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ మెంబెర్స్, పంచాయతీ కార్యదర్శులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో నాలుగు గ్రామాలు మినహా అన్ని గ్రామలలో ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగింద న్నారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు భూ సర్వే గురించి కొంత అభ్యంతారాలు వ్యక్తం చేశారు. మునగాల గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని సర్పంచ్ లోకేష్ రెడ్డి పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు, మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ నజీమ్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ మురళి నాయక్, పంచాయతీ రాజ్ ఎఈ శంకర్ పలు అంశాలపై మాట్లాడారు.

మొక్కుబడిగా నందికొట్కూరు మండల సర్వసభ సమావేశం

నందికొట్కూరు: మండల సర్వసభ సమావేశం శుక్రవారం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశంలో గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధిపై చర్చించేందుకు అవకాశం ఉన్న తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. నందికొట్కూరు మండల ప్రజా పరిషత్ ఆవరణంలో ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం జరిగింది. 12 మంది సర్పంచులకు గాను 5 మంది మాత్రమే హాజరు అయ్యారు. 11 మంది ఎంపీటీసీలు గాను, ముగ్గురు వైసిపి ఎంపీటీసీలు హాజరు కాగా, అందులో టీడీపీ -4, వైసీపీ -4, 8 మంది గైరాజరయ్యారు. మొక్కుబడిగా సమావేశం తీర్మానాలు లేని సమావేశం, వైసీపీ పార్టీ నాయకుల మధ్య చర్చ కొనసాగింది. సమావేశంలో శాతనకోట సర్పంచ్ జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ విద్యుత్, పౌరసరపార శాఖ, అధికారులపై సమస్యలు, పరి ష్కరించాలని, అదేవిధంగా కేసి కాల్వకు నీరు విడుదల చేసే సమయంలో రైతులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శాతనకోట సర్పంచ్ జనార్దన్ గౌడ్

సంక్షేమ పథకాలతో కుటుంబాల్లో సంతోషం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల మండలంలోని చాబోలు గ్రామంలో 160వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ముందుగా గ్రామ వైసిపి నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ చాబోలు గ్రామంలో రూ.4 కోట్ల అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. రాబోయో ఎన్నికలలో అఖండ మెజార్టీతో వైసిపిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీవో సుగుణ శ్రీ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, సర్పంచ్ మౌనిక, ఎంపీటీసీ చెన్నయ్య, ఉపసర్పంచ్ హుస్సేన్ భాషా, నగనందరెడ్డి, రాజగోపాల్ రెడ్డి,మదర్ సా,తిమోతి, బాల ఉసేని, పాలమాభు, విశాల్ రెడ్డి మధు గోపాల్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డి, మహేష్, శివ నారాయణ, వైసిపి కార్యకర్తలు సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే